WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036, 9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 237 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 24 ఆగస్టు 2025 | వెల : 2-00



## ఇప్పటిదాకా ఓ లెక్క..
## ఇప్పటినుంచి మరో లెక్క

- ఏపీ జేఏసీ అమరావతి
- ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలు తీరుస్తామని గతంలో చంద్రబాబు చెప్పారు
- జూన్‌లో జరగాల్సిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఆగస్టులో జరిగాయి.
- సీఎస్ఎంఎఫ్‌లో సంబంధం లేకుండా ప్లే స్లిప్‌లో మా బకాయిలు చూపించాలి

2

## అధికార లాంఛనాలతో..
## సురవరం అంత్యక్రియలు

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- నేటి మధ్యాహ్నం 3 గంటలకు అంతిమయాత్ర
- ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్
- సహా ప్రముఖుల సంతాపం

వివరాలు 2లో..



## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి
## అత్యంత ఆందోళనకరం



- కేవలం ఈ 14 నెలల్లోనే రూ.1,86,361 కోట్లు అప్పు చేసిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పులో ఇది ఏకంగా 56%
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019-24 మధ్య చేసిన అప్పు రూ.3,32,671 కోట్లు
- మీ అవినీతి వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- ఆదాయాలు తగ్గి.. ఆకాశాన్ని అంటేలా అప్పులు పెరగడం ఆందోళనకరం.. 2023-24తో పోల్చితే 2024-25లో రాష్ట్ర సొంత ఆదాయ వృద్ధి కేవలం 3.08 శాతమే

**అమరావతి, స్వర్ణసాగరం**

చంద్రబాబు కూటమి ప్రభుత్వం వైఫల్యాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ నమ్మబలికిన టీడీపీ, జనసేన కూటమి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తంగా మార్చేసిందని తూర్పారబట్టారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గణాంకాలను - మిగతా3లో



## ఏడాదికి 50 రాకెట్లు ప్రయోగించగలమా?

- అంతరిక్ష శాస్త్రవేత్తలను ప్రశ్నించిన ప్రధాని మోదీ
- ప్రైవేటు రంగం ముందుకొచ్చి సహకరించాలని పిలుపు
- భవిష్యత్తులో చేపట్టే మిషన్ల కోసం భారత్ వ్యోమగాముల సమూహాన్ని ఏర్పాటు

2

## 2047 నాటికి స్పేస్ లీడర్ ఇండియా

- అంతరిక్ష ప్రయోగాల్లో మనకు తిరుగులేదు
- 'గగన్‌యాన్' మిషన్ వ్యోమగాముల ధీమా
- అంతరిక్ష ప్రయోగాల్లో భారత్‌కిక స్వర్ణయుగమే శుభాంశు భవిష్యవాణి

2




## సార్లొచ్చారు

- 16,347 మంది జీవితాల్లో వెలుగులు
- రాష్ట్ర చరిత్రలో ఇదే అతిపెద్ద డీఎస్సీ
- నాలుగు నెలల్లోనే భర్తీ ప్రక్రియ పూర్తి
- నేడు మెరిట్ అభ్యర్థులకు కాల్ లెటర్లు
- రేపటినుంచి జిల్లాల్లో సర్టిఫికెట్ల పరిశీలన
- ఒక్క పోస్టూ భర్తీ చేయకుండా జగన్ వంచన

**అమరావతి, స్వర్ణసాగరం**

ప్రభుత్వ ఉద్యోగం అనేది ఓ కల. టీచర్ ఉద్యోగం సాధించడమనేది కొన్ని లక్షల మంది నిరుద్యోగుల జీవితాశయం. అలాంటి వారి లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. విభజిత రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి ఒకేసారి 16,347 మంది జీవితాల్లో వెలుగులు నింపింది. సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తర్వాత మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. ఎలాంటి న్యాయ వివాదాలకూ తావులేకుండా - మిగతా3లో



India Post

## అమెరికాకు తపాలా సర్వీసులు
## తాత్కాలికంగా బంద్

- ఈ నెల 25 నుంచే అమల్లోకి..
- 100 డాలర్ల దాకా విలువైన లేఖలు, డాక్యుమెంట్లు, గిఫ్ట్ ఐటమ్స్ పంపొచ్చు
- అవి మినహా ఇతర పార్సిళ్ల బుకింగ్‌లు నిలిపివేత
- తపాలా శాఖ ప్రకటన

**న్యూఢిల్లీ, స్వర్ణసాగరం**

అమెరికాకు కొన్ని రకాల తపాలా సేవలను ఈ నెల 25వ తేదీ నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు భారత తపాలా శాఖ ప్రకటించింది. పన్ను నిబంధనల్లో అమెరికా ప్రభుత్వం మార్పులు చేయడమే ఇందుకు కారణమని వెల్లడించింది. ప్రధానంగా పార్సిల్ సేవలను నిలిపివేయనున్నట్లు పేర్కొంది. 800 డాలర్ల వరకు విలువైన వస్తువులపై పన్నురహిత మినహాయింపులను ఉపసంహరిస్తున్నట్లు - మిగతా3లో

## స్వచ్ఛ గ్రామాలు..
## స్వచ్ఛ ఆలోచనలు




"
- ఊరిని శుభ్రంగా ఉంచడమే కాదు.. మంచి దృక్పథమూ ఉండాలి
- వాళ్లు చెత్తపై పన్ను వేశారు.. మేం దాంతో సంపద సృష్టిస్తున్నాం
- పారిశుద్ధ్య కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా
- 'స్త్రీశక్తి'తో ఇప్పటికే కోటి మంది ఉచిత ప్రయాణం
- పెద్దాపురం 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' సభలో సీఎం

**కాకినాడ, రాజమహేంద్రవరం, స్వర్ణసాగరం**

'స్వచ్ఛ ఆంధ్ర అంటే ఊళ్లో చెత్తను తీయడమే కాదు మన ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలి. గత ప్రభుత్వంలో చెత్తపై పన్ను వేసి, ఎక్కడా చెత్త తీసింది లేదు. 85 లక్షల టన్నుల చెత్తను పట్టణాల్లో వదిలేశారు. మా ప్రభుత్వం పన్ను రద్దు చేయడంతో పాటు ఇళ్లలో వ్యర్థాలకు డబ్బులు ఇస్తున్నాం. ఇదీ నాటి పాలనకు, నేటి పాలనకు తేడా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం నిర్వహించిన 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలి, ఆదాయం పెరగాలి, ఆనందంగా గడపాలని తమ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. వ్యర్థాలతో సంపదను సృష్టించేలా సర్క్యులర్ ఎకానమీ పాలసీని తీసుకువచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు. 'వరి గడ్డి నుంచి అట్టపెట్టెల తయారీ, సముద్రపు నాచుతో బయోకెమికల్, ప్రొటీన్, మెడిసిన్ తయారుచేసే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిషేధించి, ఈ-వ్యర్థాలను రీసైక్లింగ్ చేయిస్తాం. ఇళ్ల వద్దకే వాహనం - మిగతా3లో

# ఇబ్బందైతే కొనకండి!

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

భారత్ నుంచి ముడి చమురు సహా పలు రకాల శుద్ధిచేసిన ఉత్పత్తులను కొనడం మీకు ఇబ్బంది అనుకుంటే అస్సలు కొనొద్దని ట్రంప్ సర్కార్‌కు భారత విదేశాగ మంత్రి జైశంకర్ తెగేసి చెప్పారు. ట్రంప్ పాలనాయంత్రాంగం అనుక్షణం స్వప్రయోజనాలతో వాణిజ్యంచేస్తూ భారత్ సైతం అదేపనిచేస్తుంటే తప్పుబట్టడం హాస్యాస్పదంగా ఉందని జైశంకర్ వ్యాఖ్యానించారు. పలుదేశాలపై ఎడాపెడా పన్నుల పిడిగుద్దులు కురిపించే ట్రంప్ అవలంభించే విదేశాంగ విధానం పూర్తిగా అగమ్యగోచరంగా తయారైందని ఎద్దేవాచేశారు. ఢిల్లీలో జరుగుతున్న 'వరల్డ్ లీడర్స్ ఫోరమ్'లో ఆయన అతిథిగా పాల్గొని పలు అంశాలపై నిర్మొహమాటంగా మాట్లాడారు. "మా సరుకు కొనాలని మీపై ఒత్తడి చేయట్లేదు కదా. మీరు భారతీయ చమురు ఉత్పత్తులను కొనకపోతే వేరే దేశాలు కొంటాయి. సరుకులను యూరప్ అమ్ముతుంది. అమెరికా కూడా అమ్ముతుంది. భారత్ సైతం అమ్ముతుంది. మావి వద్దనుకుంటే, సమస్య అనుకుంటే కొనకుంటే సరిపోతుందికదా"అని జైశంకర్ వ్యాఖ్యానించారు.'అమెరికా సంప్రదాయక విదేశాంగ విధానానికి ట్రంప్ తిలోదకాలిచ్చారు. ఏ దేశం గురించి ఆయన ఏం అనుకుంటున్నారో ఎవ్వరికీ తెలీదు. అసలు ట్రంప్ సారథ్యంలో అమెరికా విదేశాంగ విధానం అగమ్యగోచరంగా, అధ్వానంగా తయారైంది. ఇలాంటి విదేశాంగ విధానాన్ని, ఇంత బాహాటంగా అమలుచేసిన



అమెరికా అధ్యక్షుడిని ప్రపంచం కనీవినీ ఎరుగదు. సొంత వ్యాపారం, వాణిజ్యం పెంచుకోవడంపైనే ట్రంప్ సర్కార్ దృష్టిపెడుతుందని అందరూ అంటారు. మరి అలాంటప్పుడు భారత్ వంటి దేశాలు రష్యా వంటి దేశాలతో వాణిజ్యం చేస్తుంటే మీకొచ్చిన ఇబ్బంది ఏంటి?. మీరు చేస్తున్న పనిని వేరొకరు చేయొద్దనడం హాస్యాస్పదం. సొంతింటిని గాలికొదిలేసి పక్కింట్లో ఏం జరుగుతుందా అని ట్రంప్ యంత్రాంగం తొంగి చూస్తుంటే నవ్వొస్తోంది. ముందు మీ ఇంటిని చక్కదిద్దుకోండి"అని ట్రంప్‌కు జైశంకర్ చురకటించారు.

**మధ్యవర్తిత్వం ఉత్తిదే**

"మేలో ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్, భారత్ యుద్ధంలో మునిగిపోకుండా తాను ఆపానని బీరాలు పలుకుతున్న ట్రంప్ మాటల్లో ఆవగింజంత అయినా నిజం లేదు. అసలు మధ్యవర్తిత్వాన్ని భారత్ ఏనాడూ ప్రోత్సహించలేదు. గతంలోనూ తగాదా తీర్చమని ఎవ్వరినీ పెద్దమనీగా పిలవలేదు. 1970వ దశకం నుంచి చూసినా గత అర్ధశతాబ్దకాలంలో పాకిస్తాన్‌తో పొరపొచ్చాలకు సంబంధించి ఎలాంటి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించకూడదని భారత్ ఏనాడో నిర్ణయించుకుంది"అని అన్నారు.

**అన్నింట్లో వైఖరి సుస్పష్టం**

"ప్రతి అంశానికి సంబంధించి భారత్‌కు స్పష్టమైన విధానముంది. అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించినాసరే ఎలాంటి వాణిజ్య ఒప్పందాల్లోనైనా మన రైతుల ప్రయోజనాలే భారతప్రభుత్వానికి అత్యున్నతం. వ్యూహాత్మక వాణిజ్యం మొదలు రక్షణ, టారిఫ్‌లు, మధ్యవర్తిత్వం దాకా ప్రతి అంశంలో భారత్ స్వీయప్రయోజనాలకే విలువ ఇస్తుంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి సంబంధించి అమెరికా ప్రతినిధి బృందంతో ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. సాగు, డెయిరీ ఉత్పత్తుల విషయంలో రైతుల ప్రయోజనాలు, సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల పరిరక్షణకు భారత్ పట్టుబట్టడంతో ఈ అంశాల్లో ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతోంది"అని జైశంకర్ అన్నారు. పన్నుల భారం మోపడంతో అమెరికా సత్సంబంధాలు సన్నగిల్లి కొత్తగా చైనాతో బంధం కాస్తంత బలపడిందన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. "ఒక సందర్భాన్ని వేరొక సందర్భంతో పోల్చిచూసి తుది నిర్ణయానికి, అంచనాకు రావడం సబబుకాదు"అని వ్యాఖ్యానించారు.

# అధికార లాంఛనాలతో.. సురవరం అంత్యక్రియలు

స్వర్ణసాగరం న్యూఢిల్లీ/హైదరాబాద్/అమరావతి

సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో జరగనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు అధికారులను శనివారం ఆదేశించారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన చేసింది. సురవరం అంతిమయాత్ర ను ఆదివారం నిర్వహిస్తున్నామని సీపీఐ ప్రకటించింది. సురవరం భౌతికకాయాన్ని ఆదివారం ఉదయం 9 గంటలకు గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం(మగ్దూం భవన్)కి తరలిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనకు ఉంచుతారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి గాంధీ వైద్య కళాశాల వరకు అంతిమయాత్ర నిర్వహిస్తారు. సురవరం భౌతికకాయాన్ని వైద్య, విద్య పరిశోధనల నిమిత్తం వైద్యకళాశాలకు అప్పగించనున్నారు. కాగా, పార్టీ శ్రేణులు ఎర్ర వస్త్రాలు ధరించి సురవరం అంతిమయాత్రలో పాల్గొనాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని కోరారు.

**అత్యున్నత నేతల్లో ఒకరు సురవరం**

దేశంలోని అణగారిన వర్గాల ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు సురవరం అని సీపీఐ కొనియాడింది. భారత కమ్యూనిస్టు అత్యున్నత నాయకుల్లో ఒకరిగా సురవరం ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సురవరం చిత్రపటానికి సీపీఐ నేతలు నివాళులర్పించారు. సురవరం మరణానికి సంతాపంగా పార్టీ జెండా అవనతం చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) ప్రధాన కార్యదర్శిగా, అఖిల



భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) అధ్యక్షుడిగా సురవరం చేసిన ప్రజాపోరాటాలను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నల్లగొండలో ఫ్లోరైడ్ కాలుష్యం, రైతుల సమస్యలు, నల్లధనం, 2జీ కుంభకోణం వంటి అంశాలపై పార్లమెంటులో చేసిన ప్రసంగాలతో సురవరం అన్ని పార్టీల గౌరవం పొందారని స్మరించుకున్నారు. ఇక, హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో ఉన్న సురవరం భౌతికకాయాన్ని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలువురు నేతలు శనివారం సందర్శించారు. పార్టీ కార్యాలయంలో సురవరం చిత్రపటానికి నివాళి అర్పించారు.

**ప్రముఖుల సంతాపం**

సురవరం మరణం పట్ల ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తమిళనాడు సీఎం స్టాలిన్, కేరళ సీఎం పినరయి విజయన్ సహా పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు. నిత్యం ప్రజల కోసమే పని చేసే సురవరం ఇక లేరంటే నమ్మలేకపోతున్నానని చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురవరం కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. న్యాయంకోసం, ఆత్మగౌరవం కోసం సురవరం సాగించిన ఉద్యమజీవితం స్ఫూర్తిదాయకమని తమిళనాడు సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. సురవరం కమ్యూనిస్టు నాయకుడే కాక గొప్ప పార్లమెంటేరియన్ అని కేరళ సీఎం పినరయి కొనియాడారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా సురవరం మృతికి సంతాపం తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే ప్రజాపోరాటాలు చేస్తూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితం ధారబోసిన వ్యక్తి సురవం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పీడిత ప్రజల కోసం అనేక ప్రజాపోరాటాలు చేసిన ఉద్యమనేత సురవరం అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేర్కొన్నారు. సురవరం మరణం పార్టీకి తీరని లోటు అని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. సురవరం మృతి పట్ల సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య, ఏఐఎసఎఫ్ రాష్ట్ర కమిటీ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ అధ్యక్షులు అనిల్ సంతాపం వ్యక్తం చేశారు.

**కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై సురవరం పోటీ**

సురవరం సీపీఐ తరఫున 1980 నుంచి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగారు. 1994లో కర్నూల్ జిల్లాలోని డోన్ నియోజకవర్గంలో అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. అంతకుముందు 1980, 1985 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 1998లో 12వ లోక్‌సభకు, 2004లో 14వ లోక్‌సభకు నల్లగొండ నుంచి ఎన్నికయ్యారు. కాగా, ఉమ్మడి ఏపీలో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు.

## అమెరికాకు తపాలా సర్వీసులు తాత్కాలికంగా బంద్

-మొదటిపేజీ తరువాయి

అమెరికా సర్కార్ జూలై 30న ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆగస్టు 29 నుంచి అమల్లోకి తీసుకొస్తామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో అమెరికాకు పంపించే అన్ని రకాల పోస్టల్ ఐటమ్స్‌పై వాటి విలువతో సంబంధం లేకుండా ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్ యాక్ట్(ఐఈఈపీఏ) టారిఫ్ ఫ్రేమ్‌వర్క్ కింద కస్టమ్స్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. 100 డాలర్ల దాకా విలువైన బహుమతులపై ఎలాంటి పన్ను ఉండదు. యూఎస్ కస్టమ్స్ విభాగం నుంచి అనుమతి పొందినవారు పోస్టల్ షిప్‌మెంట్స్‌పై పన్ను వసూలు చేసి, అమెరికా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు ఈ నెల 25 నుంచి అమెరికాకు పోస్టల్ పార్సిళ్లను పంపించడం ఆపేస్తున్నట్లు విమానయాన సంస్థలు ప్రకటించాయి. తపాలా శాఖ ఇలాంటి నిర్ణయమే తీసుకుంది. 100 డాలర్ల దాకా విలువైన లేఖలు, డాక్యుమెంట్లు, గిఫ్ట్ ఐటమ్స్ మినహా ఇతర పార్సిళ్ల బుకింగ్‌ను నిలిపివేస్తున్నట్లు స్పష్టంచేసింది. పార్సిళ్లను అమెరికాకు పంపడానికి ఇప్పటికే సొమ్ము చెల్లించినవారు రీఫండ్ పొందవచ్చని సూచించింది. ఆయా పార్సిళ్లను తిరిగి పొందాలని పేర్కొంది. వినియోగదారులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నామని ఒక ప్రకటనలో వివరించింది. అమెరికాకు అన్ని రకాల పోస్టల్ సేవలను సాధ్యమైనంత త్వరగా పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేసింది. అమెరికా పన్ను నిబంధనల్లో మార్పుల కారణంగా భారత్‌తోపాటు స్కాండినేవియా, ఆస్ట్రియా, ఫ్రాన్స్, బెల్జియం తదితర దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆయా దేశాలు అమెరికాకు పార్సిల్ డెలివరీలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తర్వాత విదేశాలపై టారిఫ్‌ల మోత మోగించిన సంగతి తెలిసిందే. ఇండియా సహా పలుదేశాలపై ప్రతీకార సుంకాలు విధించారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. ఇందులో భాగంగానే పోస్టల్ సేవలపై పన్నురహిత మినహాయింపులను ఉపసంహరించారు.

## ఏడాదికి 50 రాకెట్లు ప్రయోగించగలమా?

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

అంతరిక్ష రంగంలో భారత్ వరుస విజయాలతో దూసుకెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు రంగం ముందుకొచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. ఏటా 5 నుంచి 6 ప్రధాన రాకెట్లను ప్రయోగిస్తున్నామని.. ప్రతి ఏడాది 50 రాకెట్లను ప్రయోగించే స్థాయికి మనం చేరుకోగలమా..? అంటూ అంతరిక్ష శాస్త్రవేత్తలు, ఇంజనీర్లను ప్రశ్నించారు. శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని మాట్లాడారు. భవిష్యత్తులో చేపట్టే మిషన్ల కోసం భారత్ వ్యోమగాముల సమూహాన్ని ఏర్పాటు చేయబోతోందని.. ఇందులో యువత కూడా పాలుపంచుకోవాలని కోరారు. 'మనం చంద్రుడు, అంగారక గ్రహాన్ని ఇప్పటికే చేరుకున్నాం. ఇప్పుడు ఇంకా లోతైన అంతరిక్షంలోకి తొంగి చూడాలి. త్వరలోనే గగన్‌యాన్ మిషన్‌ను ప్రారంభించబోతున్నాం. అలాగే సొంత స్పేస్‌స్టేషన్‌ను కూడా నిర్మించుకోబోతున్నాం' అని చెప్పారు.

## ఉత్తరాఖండ్‌లో మళ్లీ క్లౌడ్ బరస్ట్.. పలువురు గల్లంతు

స్వర్ణసాగరం చమోలీ

ఉత్తరాఖండ్‌ను మళ్లీ భారీ వరదలు చుట్టుముట్టాయి. తాజాగా చమోలీ జిల్లాలో థరలీలో కురిసిన భారీ వర్షం కారణంగా వరదలు సంభవించాయి. ఫలితంగా అనేక నివాస ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. లెక్కలేనన్ని వాహనాలు బురదలో కూరుకుపోయాయి. విద్యాసంస్థలను మూసివేశారు. వరదలు కారణంగా పలువురు గల్లంతైనట్లు సమాచారం. ఈ విపత్తుపై సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు తక్షణం వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకొని సహాయక చర్యలు మొదలుపెట్టాయి. వరదల్లో చిక్కుకున్నవారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి ఎక్స్ వేదికగా స్పందిస్తూ 'చమోలీ జిల్లాలోని థరాలి ప్రాంతంలో క్లౌడ్?బరస్ట్ సంభవించింది. జిల్లా యంత్రాంగం, ఎస్‌డిఆర్ఎఫ్, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపడుతున్నారు. తాను స్థానిక పరిపాలన అధికారులతో నిరంతరం సంప్రదిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాను. ప్రజలంతా సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నానని' అన్నారు ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. వర్షాల కారణంగా సంభవించిన విపత్తుకు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక అనుసంధాన రహదారులు మూసుకుపోవడంతో ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంతలో ఆగస్టు 22 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. పిథోరగఢ్, బాగేశ్వర్ జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. భారత వాతావరణ శాఖ తెలిపిన సమాచారం ప్రకారం అతి స్వల్ప సమయంలో భారీ వర్షాలకు దారి తీయడాన్నే క్లౌడ్ బరస్ట్ అని అంటారు.

# 2047 నాటికి స్పేస్ లీడర్ ఇండియా

న్యూఢిల్లీ

ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్‌కు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సిద్ధమవుతోంది. స్వదేశీ వ్యోమగాములను స్వదేశీ పరిజ్ఞానంతో, స్వదేశీ రాకెట్‌లో అంతరిక్షంలోకి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2027లో ఈ మానవసహిత యాత్ర చేపట్టే అవకాశం ఉంది. అంతకంటే ముందు గగన్‌యాన్ యాత్ర(జీ1)లో భాగంగా ఈ ఏడాది డిసెంబర్‌లో మానవరహిత టెస్టు ఫ్లైట్‌ను ప్రయోగించబోతున్నారు. వ్యోమమిత్ర హ్యూమనాయిడ్ రోబోను అంతరిక్షంలోకి పంపిస్తారు. మానవసహిత యాత్రకు అవసరమైన సంక్లిష్ట సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలను పరీక్షించడమే జీ1 యాత్ర ఉద్దేశం. మానవసహిత గగన్‌యాన్ యాత్రకు నలుగురు వ్యోమగాములు శుభాంశు శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్ ఎంపికయ్యారు. ఇస్రో ఆధ్వర్యంలో వారికి ఇప్పటికే శిక్షణ ప్రారంభమైంది. శుభాంశు శుక్లా ఇటీవల అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్)కు వెళ్లొచ్చిన సంగతి తెలిసిందే. జాతీయ అంతరిక్ష దినం సందర్భంగా నలుగురు వ్యోమగాములు శనివారం సమావేశమయ్యారు. తమ అనుభవాలు పంచుకున్నారు. ఐఎస్ఎస్ నుంచి మన భూమిని దర్శించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని శుభాంశు పేర్కొన్నారు. అది అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మానవులకు భూమి ఎంతో విలువైన గ్రహం అని అర్థమైందని చెప్పారు. ఐఎస్ఎస్ యాత్ర తనకు అతిపెద్ద పాఠమని, ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. గగన్‌యాన్ యాత్ర కోసం ఆసక్తిగా ఎదురు




చూస్తున్నానని వ్యాఖ్యానించారు. భారతదేశ అంతరిక్ష ప్రయోగాల్లో ఇదొక స్వర్ణయుగమని, ఇందులో తాను భాగస్వామి అవుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఒక వ్యోమగామి దృష్టి ఎల్లప్పుడూ సరిహద్దులకు అతీతంగా ఉంటుందని గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్ అన్నారు. అంతరిక్ష రంగంలో పనిచేసేవారు ఇతర గ్రహాలపై ఆవాసాలు, భవిష్యత్తు గురించి ఆలోచిస్తారని వెల్లడించారు. అంతరిక్ష ప్రయోగాలు మన ఆలోచనా పరిధిని విస్తృతం చేస్తాయన్నారు. గగన్‌యాన్ మిషన్ అనేది ఎన్నో ఇతర మిషన్ల సమ్మేళనం అని వివరించారు. 2047 నాటికి ఇండియా 'స్పేస్ లీడర్'గా ఎదగడానికి ఈ యాత్ర దోహదపడుతుందన్నారు. మరో 20 ఏళ్లలో మనం అగ్రస్థానానికి చేరుకోవడం ఖాయమన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలపై అంగద్ ప్రతాప్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇతర దేశాల్లో ఎన్నో పెద్ద అవకాశాలు వచ్చినప్పటికీ వదులుకొని మన దేశం కోసం వారు పని చేస్తున్నారని కొనియాడారు.

**మానవ సహిత యాత్రల్లో ముందడుగు**

అంతరిక్ష కార్యకలాపాలు ఏవైనా సరే అవి మన భూమికి, మనుషులకు లబ్ధి చేకూర్చేలా ఉండాలని అజిత్ కృష్ణన్ అభిప్రాయపడ్డారు. అలా లేకపోతే అవి వ్యర్థమేనని ఉద్ఘాటించారు. మానవ సహిత అంతరిక్ష యాత్రల్లో భారత్ ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. అంతరిక్ష రంగంలో భారత్ మరెన్నో గొప్ప విజయాలు సాధించడానికి స్పేస్ సైంటిస్టులు, వ్యోమగాములు కలిసికట్టుగా పని చేయాలన్నారు. గత ఐదేళ్లలో ఎంతో సాధించామని, చంద్రుడిపైకి వెళ్లామని, డాకింగ్ ప్రక్రియను విజయవంతం చేశామని గుర్తుచేశారు. స్పేస్ సెక్టార్‌లో ఎన్నో స్టార్టప్‌లు వస్తున్నాయని చెప్పారు. అంతరిక్షంలో మన పరుగులు చూసి ఇతర దేశాలు అసూయ చెందుతున్నాయని వ్యాఖ్యానించారు. మన్ రోడ్‌మ్యాప్%–%2047 చాలా బలంగా ఉందన్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో మనం ఇప్పటిదాకా సాధించింది తక్కువేమీ కాదని బాలకృష్ణన్ నాయర్ పేర్కొన్నారు.

# ఇప్పటిదాకా ఓ లెక్క.. ఇప్పటినుంచి మరో లెక్క

స్వర్ణసాగరం విజయవాడ

మూడు నెలల్లో పెండింగ్ బకాయిలు క్లియర్ చేయకపోతే పోరుబాట పడతామని చంద్రబాబు సర్కార్‌ను ఏపీ జేఏసీ అమరావతి హెచ్చరించింది. శనివారం కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వంపై మా వైఖరీలో "ఇప్పటివరకు ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క" అంటూ తేల్చి చెప్పింది. ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు మాట్లాడుతూ.. ఏడాది దాటినా కానీ.. సీఎం, కేబినెట్ ఉపసంఘం మాతో చర్చించలేదన్నారు. ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలు తీరుస్తామని గతంలో చంద్రబాబు చెప్పారు. జూన్‌లో జరగాల్సిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఆగస్టులో జరిగాయి. ఏ అంశం పరిష్కారం కాలేదు" అని ఆయన మండిపడ్డారు. "ఒక్కో ఉద్యోగికి మూడు నుండి 5లక్షలు, రిటైర్డ్ ఉద్యోగులకు 15 నుండి 20 లక్షలు బకాయిలు ఉన్నాయి. సీఎస్ఎంఎఫ్‌లో సంబంధం లేకుండా ప్లే స్లిప్‌లో మా బకాయిలు చూపించాలి. నాలుగు డీఎలు పెండింగ్‌లో ఉన్నాయి. డీఏ, ఐఆర్ కోల్పోవడం, బకాయిలు ఇవ్వకపోవడంతో వేల కోట్లు నష్టపోయాం. మా హక్కును మేం అడుగుతున్నాం. మూడు నెలల్లో బకాయిలు చెల్లించకపోతే పోరుబాట పడతాం" అని బొప్పరాజు చెప్పారు. ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి దామోదర్ మాట్లాడుతూ.. ఉద్యోగి కుటుంబం నుంచి వచ్చానని చెప్పిన పవన్ ఇప్పుడు మాట్లాడటం లేదు. 2023 నుంచి ఐఆర్ రావాలి. వేల కోట్లు బకాయిలు ఉన్నాయి. మా సమస్యలు పరిష్కరించకుంటే ఎటువంటి ఉద్యమాకైన సిద్ధం. ప్రభుత్వ స్థలాలు, ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్ వ్యాపారవేత్తలకు అప్పగిస్తే సంపద సృష్టి జరగదు.



# స్వచ్ఛ గ్రామాలు.. స్వచ్ఛ ఆలోచనలు

-మొదటిపేజీ తరువాయి


పంపించి.. ప్లాస్టిక్, ఈ-వేస్ట్, ఇతర వ్యర్థాలను సేకరించి వాటికి డబ్బులిస్తున్నాం. మాకు సంపద సృష్టించడంతో పాటు ఆదాయాన్ని పంచడం తెలుసు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో 95, గ్రామీణ ప్రాంతాల్లో 48 శాతం చెత్తసేకరణ జరుగుతోంది. ఐదు లక్షల కుటుంబాలు కంపోస్ట్ తయారు చేసి, గార్డెనింగ్‌కు వినియోగిస్తున్నాయి. మరో 10.65 లక్షల మంది కిచెన్, టెర్రస్ గార్డెన్‌లతో ఆదర్శంగా నిలుస్తున్నారు. అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత ఆంధ్రప్రదేశ్‌గా మారుస్తాం. పురపాలక సంఘాలు మొదలుకొని అంగన్‌వాడీ కేంద్రాల వరకు స్వచ్ఛ పురస్కారాలు అందిస్తాం.

**సూపర్‌హిట్ చేసి చూపించాం**

నేను, పవన్ కల్యాణ్ ఆ రోజు సూపర్ సిక్స్ అని ముందుకొచ్చాం. చాలామంది సాధ్యం కాదన్నారు.. ఈరోజు ఎన్డీయే ప్రభుత్వం సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసి చూపించింది. ఒకటో తేదీన నూరు శాతం పింఛన్లు, 47 లక్షల మంది రైతులకు అన్నదాతా సుఖీభవ సాయం, మరమగ్గాలు, చేనేత మగ్గాలకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. త్వరలో నేతన్న భరోసా కింద రూ.25 వేలు ఇస్తాం. నాయీబ్రాహ్మణులు, సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు లబ్ధి చేకూర్చాం. ఉచిత బస్సు అంటే ఎగతాళి చేశారు. వారంలోనే కోటి మందికి పైగా మహిళలు ప్రయాణం చేశారు. డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి కార్యక్రమం చేపట్టాం. రూ.10 లక్షల కోట్లు విలువచేసే వివిధ ప్రాజెక్టులకు ఒప్పందాలు చేసుకున్నాం. ఇంతకన్నా సంక్షేమ పాలన ఉంటుందా?

**భవిష్యత్తు మరింత ఆశాజనకం**

ఒక్కో ఇటుక పేర్చుకుంటూ, ఒక్కో మెట్టు ఎక్కుతున్నాం. విదేశాల నుంచి పెట్టుబడులు, కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నాం. విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా రూ.12 వేల కోట్లు మంజూరు చేయించి, పనులు ప్రారంభించాం. భవిష్యత్తు మరింత ఆశాజనకంగా ఉంటుంది. అక్టోబర్ నుంచి పేదలపై పన్నుల భారం తగ్గి, కొనుగోలు శక్తి పెరుగుతుంది. అభివృద్ధి, మెరుగైన జీవన ప్రమాణాలు సుస్థిర పాలనతో సాధ్యం. అందుకే వైకుంఠపాళిలా కాకుండా కొన్నాళ్లపాటు మాకే అవకాశమివ్వండి' అని సీఎం పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వ్యక్తిగత ప్రమాద బీమా పత్రం అందిస్తున్న సీఎం చంద్రబాబు. వేదికపై మంత్రి నారాయణ, ఎంపీలు సతీష్, ఉదయ్ శ్రీనివాస్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి, ఎమ్మెల్యే దివ్య తదితరులు




**పారిశుద్ధ్య కార్మికులకు కొత్తగా బీమా**

పారిశుద్ధ్య కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా వర్తించేలా యాక్సిస్ బ్యాంకు కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చిందని చంద్రబాబు చెప్పారు. శాశ్వత ఉద్యోగి అయితే రూ.కోటి, తాత్కాలిక ఉద్యోగికి రూ.20 లక్షలు.. శాశ్వత వైకల్యం సంభవిస్తే రూ.కోటి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి రూ.20 లక్షలు, పాక్షిక వైకల్యానికి గురయితే 75 శాతం, కాంప్లిమెంటరీ ఎడ్యుకేషన్ గ్రాంట్ కింద రూ.8 లక్షల సాయం అందించనున్నారని వివరించారు. రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో 55,686 మంది పారిశుద్ధ్య సిబ్బందికి ఈ బీమా భద్రత లభించనుందన్నారు. పురపాలకశాఖ ఉన్నతాధికారులు, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులతో పారిశుద్ధ్య కార్మికులకు బీమా పాలసీ పత్రాలను అందించారు. తొలుత పెద్దాపురం పట్టణంలోని కుమ్మరవీధి దొరయ్యపేటలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రెయిన్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలు, చిన్నారులతో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అందాయా లేదా అని ఆరా తీశారు. ఆటోగ్రాఫ్ అడిగిన ముగ్గురు విద్యార్థుల చొక్కాలపై సంతకాలు చేశారు. మహిళలతో కలిసి సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం పట్టణంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పురపాలకశాఖ మంత్రి నారాయణ, ఎంపీలు ఉదయ శ్రీనివాస్, సానా సతీష్, ప్రభుత్వ విప్ యనమల దివ్య, పెద్దాపురం శాసనసభ్యుడు చినరాజప్ప, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

**50 కుటుంబాల దత్తత**

పెద్దాపురంలో లలితా రైస్ ఇండస్ట్రీస్‌కు చెందిన మట్టె శ్రీనివాస్, పట్టాభి ఆగ్రోఫుడ్స్ ఎండి బీవీ కృష్ణారావు మార్గదర్శులుగా చెరో 25 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు వేదికపై ప్రకటించారు. వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరం: వైఎస్ జగన్

-మొదటిపేజీ తరువాయి

ఉటంకిస్తూ చంద్రబాబు కూటమి సర్కార్ ఆర్థిక విధానాలను కడిగిపారేశారు. ఈ మేరకు వైఎస్ జగన్ శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో ఇంకా ఏమన్నారంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2019%–%24 మధ్య అప్పటి విపక్షాలు తెలుగుదేశం, జనసేన పార్టీ లు పదే పదే అసత్యాలు ప్రచారం చేస్తూ, ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా పని చేశాయి. ప్రభుత్వ విధానాల వల్ల అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని, మరోవైపు కీలక రంగాల్లో మూల ధన వ్యయం బాగా తగ్గడం వల్ల ప్రభుత్వ ఆదాయం దారుణంగా తగ్గుతోందని.. దీని వల్ల రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందడం లేదని, అది ఆర్థిక మాంద్యాన్ని సూచిస్తోందని నిందించాయి. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టించి, రాష్ట్ర ఆదాయాన్ని చాలా వేగంగా పెంచడంతో పాటు, అప్పులు పెరగకుండా చూస్తామని గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీ లు హామీ ఇచ్చాయి. కానీ.. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరును ఒకసారి పరిశీలిస్తే, కఠోర వాస్తవాలు కనిపిస్తాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024%–%25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయంలో (పన్నులు, పన్నేతర వసూళ్లు), అంతకు ముందు ఏడాది (2023%–%24)తో పోల్చి చూస్తే కేవలం 3.08 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. అదే సమయంలో దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 9.8 శాతం వృద్ధి ఉంటుందని అంచనా వేస్తే, కేంద్ర ప్రభుత్వ సొంత ఆదాయంలో 12.04 శాతం పెరుగుదల నమోదైంది. మరి ఇక్కడ టీడీపీ కూటమి ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్నట్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) 12.02 శాతం ఉంటే, ప్రభుత్వ సొంత ఆదాయం అత్యల్పంగా 3.08 శాతం వృద్ధికే ఎందుకు పరిమితమైంది? గత ఏడాది రాష్ట్ర ఆదాయం దారుణంగా పడిపోయినప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరం 2025%–%26లో పరిస్థితి మారుతుందని అంతా భావించారు. కానీ, ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో అదే ఆర్థిక అస్తవ్యస్త పరిస్థితి ప్రస్ఫుటమవుతోంది. గత ఏడాది ఇదే సమయంతో పోల్చి చూస్తే, వస్తు సేవల పన్ను (జీఎస్టీ), అమ్మకం పన్నుల ఆదాయంలో ఇప్పటికే తగ్గుదల కనిపిస్తోంది. ఇదే సమయంలో 2023%–%24లో తొలి నాలుగు నెలల్లో వచ్చిన ఆదాయంతో, ఇప్పుడు 2025%–%26లో మొదటి నాలుగు నెలల్లో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని (సీఎజీఆర్) పరిగణనలోకి తీసుకుంటే అది కేవలం 2.39 శాతం మాత్రమే పెరిగింది. వాస్తవానికి అది కనీసం 10 శాతం ఉండాల్సి ఉంది. మరో అత్యంత ఆందోళకర అంశం రాష్ట్ర అప్పులు విపరీతంగా పెరగడం. వైఎస్సార్‌సీపీ హయాంలో 2019%–%24 మధ్య రాష్ట్ర ప్రభుత్వ మొత్తం రుణాలు (పబ్లిక్ డెట్, పబ్లిక్ ఎక్కౌంట్, ప్రభుత్వ గ్యారెంటీతో కార్పొరేషన్ల అప్పులు, ప్రభుత్వ గ్యారెంటీ లేకుండా చేసిన కార్పొరేషన్ల అప్పులు) రూ.3,32,671 కోట్లు. కాగా, టీడీపీ కూటమి ప్రభుత్వం కేవలం ఈ 14 నెలల్లో చేసిన మొత్తం అప్పులు ఏకంగా రూ.1,86,361 కోట్లు. అంటే గత ప్రభుత్వం మొత్తం ఐదేళ్లలో చేసిన అప్పులో 56 శాతం రుణాలను కూటమి ప్రభుత్వం కేవలం 14 నెలల్లోనే చేసింది. ఒకవైపు రాష్ట్ర ఆదాయంలో వృద్ధి చాలా తక్కువగా ఉండడం, మరోవైపు అప్పులు ఆకాశాన్ని అంటే విధంగా పెరగడం అత్యంత ఆందోళనకరం. అందుకే ఇప్పటికైనా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం, తమ విధానాలను పునరాలోచించాలి.



## స్త్రీ శక్తి పథకానికి మహిళల నుండి అపూర్వ స్పందన

కృష్ణాజిల్లా ఏపీఎస్ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి కె. వెంకటేశ్వర్లు



గన్నవరం, స్వర్ణసాగరం

స్త్రీ శక్తి పథకానికి మహిళల నుండి అపూర్వ స్పందన లభిస్తుందని కృష్ణాజిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన గన్నవరం డిపోను సందర్శించినారు. గన్నవరం డిపోలో 61 బస్సులకు గాను 51 బస్సులకు స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఉందని తెలిపినారు. స్త్రీ శక్తి పథకం ఈనెల 15వ తేదీ న ప్రారంభించిన రోజు నుంచి 22వ తేదీ వరకు అనగా 8 రోజులకు గాను గన్నవరం డిపో బస్సులలో 1.10 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, 34 లక్షల రూపాయలు రాయితీ పొందారని ఆయన తెలిపారు. ఎటువంటి ఫిర్యాదులు లేకుండా, ఎటువంటి బస్సు ఫెయిల్యూర్సు లేకుండా గన్నవరం డిపోలో స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందుకు ఆయన డిపో మేనేజర్ ను, సూపర్వైజర్లను, సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ జీరో బ్రేక్ డౌన్స్ లక్ష్యంగా, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తిస్తూ ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పనిచేయాలని అన్నారు. ఆయన డిపోలోని అన్ని సెక్షన్లను, బస్సులను తనిఖీ చేసినారు. బస్సు రిపేర్ అయిన తర్వాత రోడ్ టెస్ట్ కు వెళ్లి బస్సు సామర్థ్యాన్ని పరిశీలించినారు. ఇకముందు కూడా గన్నవరం డిపోలో స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలని తెలిపారు.

## వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితుడు అరెస్టు




గన్నవరం, స్వర్ణసాగరం

వరుసగా దొంగతనాలు చేస్తున్న ఒక నేరస్థుడిని ఉంగుటూరు పోలీసు అధికారులు అరెస్టు చేసి, అతని వద్ద నుండి సుమారు ఏడు లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో వెన్నుతల గ్రామంలో బొమ్మి సింహాచలం అనే మహిళ ఇంట్లో దొంగతనం జరిగింది. ఈ ఘటనపై ఉంగుటూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తు చేయమని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు ఆదేశాలు జారీ చేశారు. గన్నవరం డి.ఎస్.పి. చలసాని శ్రీనివాసరావు, సి.ఐ. శివ ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఏర్పడింది. సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా చిత్రాలు ఆధారంగా విచారణ జరిపిన పోలీసులు ఈ నేరానికి విజయవాడకు చెందిన పాత నేరస్థుడు బుగత శివ (34 సంవత్సరాలు) కారణమని గుర్తించారు. అతని పై గతంలో పలు పోలీసు స్టేషన్లలో ఇరవైకి పైగా దొంగతన కేసులు, ఒక హత్య కేసు ఉన్నట్టు తేలింది. ఇటీవల జైలు నుండి బయటపడి మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ నెల 22వ తేదీన ఆనందపురం అడ్డరోడ్డు వద్ద వాహనాల తనిఖీ జరుగుతున్న సమయంలో బుగత శివ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను వెన్నుతలలో దొంగిలించిన మూడు కాసుల బంగారు గొలుసు, బాదంపూడి ప్రాంతంలో దొంగిలించిన ఆభరణాలు, అలాగే ఎలూరు, వీరవల్లి ప్రాంతాల్లో దొంగిలించిన మూడు మోటార్ సైకిళ్లను పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో గన్నవరం ఉప పోలీసు అధికారి చలసాని శ్రీనివాసరావు పర్యవేక్షణలో గన్నవరం సి.ఐ. శివ ప్రసాద్ మార్గదర్శకత్వంలో ఉంగుటూరు ఎస్.ఐ. యు. గోవిందు, సిబ్బంది మట్టా నవీన్ బాబు, నిమ్మకురి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

## సార్లొచ్చారు

-మొదటిపేజీ తరువాయి

పరీక్షలు, ఫలితాల ప్రక్రియను పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం ఆదివారం మెరిట్ అభ్యర్థులకు కాల్ లెటర్లు అందిస్తోంది. గత డీఎస్సీలు అంటే వివాదాలే గుర్తుకొస్తాయి. నోటిఫికేషన్లు జారీ అయినా రకరకాల వివాదాలతో అడుగడుగునా బ్రేకులు పడేవి. ఇక ఆ ప్రక్రియ ఎంతకాలానికి పూర్తవుతుందో ఎవరికీ అంతుపట్టేది కాదు. అలాంటి ఒకేసారి 16,347 పోస్టులు ప్రకటించిన డీఎస్సీని ప్రభుత్వం రికార్డు సమయంలో పూర్తిచేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 20న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటించారు. జూన్ 6 నుంచి జూలై 2 వరకు మొత్తం 67 విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 3.12 లక్షల మంది పరీక్షలు రాశారు. మొత్తం ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ఆన్‌లైన్‌లో నిర్వహించింది. టెట్ మార్కుల్లోనూ వివాదాలకు అవకాశం లేకుండా అనేకసార్లు అప్‌డేషన్‌కు అవకాశం కల్పించింది. ఎంపికైనవారి జాబితాలు నేరుగా ప్రకటించాలని భావించినా, అభ్యర్థుల్లో అనుమానాలకు తావివ్వకూడదనే ఉద్దేశంతో శుక్రవారం రాత్రి మెరిట్ జాబితాలు ప్రకటించింది. ఆదివారం అభ్యర్థులకు కాల్ లెటర్లు అందించనుంది. ఈ మొత్తం ప్రక్రియకు 125 రోజులు మాత్రమే పట్టింది. మరో వారం రోజుల్లో భర్తీ ప్రక్రియ కూడా పూర్తికానుంది.

**ఏడేళ్ల తర్వాత మెగా డీఎస్సీ**

ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాలకు కలిపి ఎక్కువ టీచర్ ఉద్యోగాలు ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత ఆ సంఖ్య పరిమితమైంది. 2014లో టీడీపీ ప్రభుత్వం 9,061 పోస్టులతో డీఎస్సీ ప్రకటించి పూర్తిచేసింది. మళ్లీ 2018లో 7,729 పోస్టులతో డీఎస్సీ ప్రకటించగా ఆ ప్రక్రియ వైసీపీ ప్రభుత్వంలో పూర్తయింది. ఆ తర్వాత జగన్ ప్రభుత్వంలో ఒక్క టీచర్ ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. దీంతో ఖాళీలు పెరిగిపోయాయి. దాదాపు ఏడేళ్ల తర్వాత విడుదల చేసిన మెగా డీఎస్సీ కావడంతో అభ్యర్థులు పెద్దఎత్తున పోటీపడ్డారు. ఇంత పెద్ద డీఎస్సీ ఇప్పట్లో ఉండదనే ఆలోచనతో లక్షల మంది పరీక్షలు రాశారు.
నిరుద్యోగులను అందులోనూ టీచర్ ఉద్యోగాల కోసం ఎదురుచూసిన వారిని గత వైసీపీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. రాష్ట్రంలో 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మెగా డీఎస్సీ ద్వారా భర్తీచేస్తానని 2019కు ముందు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ పదేపదే ప్రకటించారు.

# ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయం.

## కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 23

స్వాతంత్రియ సమరయోధుడు ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయమని కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల మల్లికార్జునరావు అన్నారు. శనివారం వికలాంగుల హక్కుల వేదిక కార్యాలయంలో జరిగిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి కనిగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపాళ్ల మల్లికార్జునరావు ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా మల్లికార్జున రావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు న్యాయవాదిగా పనిచేస్తూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిని గడగడలాడించిన చరిత్ర ప్రకాశం పంతులుదని ఆయన అన్నారు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన నీతి నిజాయితీలతో పనిచేశారని ఆయన అన్నారు, ప్రకాశం పంతులు జీవితం యువతకు ఆదర్శమని మల్లికార్జున్ రావు అన్నారు, ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శమని కనిగిరి బ్రాహ్మణ సంఘం నాయకులు చక్కిలం మురళీకృష్ణ, సాదు చలపతిరావు, సింగంపల్లి రాంప్రసాద్ అన్నారు, ప్రకాశం పంతులు మన జిల్లాలో పుట్టడం మన జిల్లాకు ప్రకాశం పంతులు పేరు పెట్టడం గర్భంగా ఉందన్నారు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రకాశం పంతులు పేరుతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు, అనంతరం ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, జోహార్ ప్రకాశం పంతులు అంటూ వారు నినాదాలు చేశారు, ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక కనిగిరి నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు, వేగినేటి వెంకట సుబ్బారెడ్డి వేముల మైనర్ బాబు, మహిళా విభాగ అధ్యక్షులు లక్ష్మీ శ్రీరామ, వెంకటేశ్వర్లు షేక్ బాషా, వెంకటేశ్వర్ రెడ్డి ప్రజా హక్కుల వేదిక నాయకుడు బత్తుల సునీల్,తదితరులు పాల్గొన్నారు.





# ప్రకాశం పంతులు సేవలు మరువలేనివి

## మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 23

స్వాతంత్ర్య సమరయోధుడు మహోన్నతమైన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శనివారం కనిగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు గారు న్యాయవృత్తి నుండీ వచ్చి స్వాత్రంత్ర కోసం పోరాడి, ఉన్నదంతా ప్రజల కోసం ఖర్చుపెట్టి, ఉన్నంతంగా బ్రతికారు అనీ, అయన ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయినప్పటికినూ, నిరడంబర జీవితం బతికారు అని కొనియాడి, జోహార్లు అని అమర్ రహే అని నినాదాలు పలికించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ1928లో మద్రాస్‌లో సైమన్ కమిషన్ వ్యతిరేక నిరసనలో పోలీసులు కాల్పులు జరపబోతున్న సమయంలో ప్రకాశం పంతులు గారు ముందుకు వచ్చి తన వక్షస్థలాన్ని చూపించరన్నారు. ఆ ధైర్యసాహసమే ఆయనకు ఆంధ్రకేసరి అనే బిరుదు తెచ్చిపెట్టింది. అలాగే ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ నిరాడంబర జీవనం గడిపి, నిజాయితీతో, పారదర్శకతతో పరిపాలించారు. సాధారణ ప్రజల సమస్యలను తానే ముందుండి విని, తానే పరిష్కరించడానికి కృషి చేశారు. ఆయన చూపిన నిజాయితీ, వినయం, ప్రజాసేవ పట్ల అంకితభావం మనందరికీ స్ఫూర్తి. ముఖ్యంగా యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజం కోసం సేవ చేయాలని కోరుతున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్, హెల్త్ ఇన్స్పెక్టర్ చెన్న కేశవులు,జూనియర్ అస్టెంట్ కొండయ్య,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కనిగిరి డిపోలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం




కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 23

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ,కనిగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం "స్వర్ణాంధ్ర %-% స్వచ్ఛ ఆంధ్ర" ప్రత్యేక కార్యక్రమాన్ని కనిగిరి డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిపో ప్రాంగణం, బస్సులు మరియు పరిసరాలను శుభ్రపరచడంతో పాటు, ప్రయాణికులకు, ఉద్యోగులకు శుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ స్వచ్ఛతే సేవ, పర్యావరణమే భవిష్యత్తు అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని స్వర్ణాంధ్ర సాధనలో శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఉందని అన్నారు. ప్రతి ప్రయాణికుడు ఆర్ టి సి బస్సులను శుభ్రంగా వాడితే,మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించగలమని డి పి టి ఓ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక శాసన సభ్యులు ఉగ్ర నరసింహ రెడ్డి డిపో అభివృద్ధి కి సహకరిస్తామని చెప్పడం జరిగిందని మన బాధ్యత తో డిపో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు సూచనలు చేశారు. స్వర్ణాంధ్ర %-% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా ప్రజల్లో శుభ్రత, పర్యావరణ పరిరక్షణ పట్ల మరింత అవగాహన పెంపొందించే ప్రయత్నం జరుగుతుందని కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కలిగించారు. ప్రజా రవాణా ఉద్యోగులు చేత శుభ్రతపై స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం,అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, ఎస్ టి ఐ ఫణి కుమార్,శానిటేరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్,గుడ్ హెల్ప్ రమేష్ బాబు,ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి.

## చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు23

కనిగిరి పట్టణంలోని 5వ సచివాలయంలో శనివారం ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా చేతుల మీదుగా రెండవ సారి ఉత్తమ అవార్డు అందుకున్న వి.ఆర్.ఓ బసిరెడ్డి శ్రీకాంత్ ను కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. వి ఆర్ ఓ శ్రీకాంత్ తన కృషి,సేవా భావం, సమాజానికి అందించిన విశిష్టమైన సేవలు కారణంగా ఈ అవార్డు లభించిందని సమాజంలో ఇలాంటి ఆదర్శవంతులైన వ్యక్తులు మరింతమందికి స్ఫూర్తి నింపుతారని అభినందించారు. సన్మాన కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు,గౌరవ అతిథులు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొని అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు. అంతరం ఐ టి డి పి రాష్ట్ర ఉపాధ్యక్షులు జాంషీర్ అహమ్మద్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మస్తాన్ వలి, స్థానిక ప్రజలు నాగురబీ, గౌస్ బాష, రహిమాన్,సన్మాన గ్రహీతకు పూల మాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు కట్టుదిట్టం -ఎస్సై శ్రీరామ్



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 23

కనిగిరి మండలంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ఎస్సై శ్రీరామ్ పంచాయతీ కార్యదర్శులతో కలిసి శనివారం పునుగోడు నేలటూరి గొల్లపల్లి చెరువులను పరిశీలించారు. గణనాధుల శోభాయాత్ర రూట్ మ్యాప్ లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీరామ్ మాట్లాడుతూ అపశృతులు లేకుండా కట్టు తిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసు సూచనలు పాటిస్తూ ప్రశాంతంగా శోభయాత్ర నిర్వహించాలని మండపాల నిర్వహకులకు సూచించారు.

# భూ సమస్యల పరిష్కారం కొరకే గ్రామ సభలు



## కోట తహసిల్దార్ జయజయ రావు

కోట స్వర్ణసాగరం ఆగస్టు 23

గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారం కొరకే గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందని,కోట మండల తహసిల్దార్ జయ జయ రావు తెలిపారు. శనివారం కోట పంచాయతీ కార్యాలయం వద్ద తహసిల్దార్ జయ జయ రావు ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయ జయ రావు మాట్లాడుతూ గ్రామాల్లోని భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. సదస్సుల ద్వారా భూ సమస్యలు,రీ సర్వే సమస్యలు,భూ వివాదాలు, తదితర సమస్యలపై,రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం తహసిల్దార్ భూ సమస్యల గురించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, సర్పంచ్ ఇండ్ల వెంకటరమణమ్మ,ఎంపీటీసీలు షేక్ శంసుద్దీన్,దారా సురేష్,కోట మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు,వీఆర్వో రమణయ్య, రెవెన్యూ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

# స్వామి వారి నిత్య అన్నదానంకి విరాళం





కాణిపాకం, ఆగస్టు 23 స్వర్ణ సాగరం

స్వామి వారు నిత్య అన్నదానం కి విరాళం.కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి నిత్య అన్నదానం కి విరాళం 1,01,116 రూపాయలు, (చెక్కు) దాత పోలా సుబ్రహ్మణ్యం , వారి కుటుంబ సభ్యులు కుక్కలపల్లి యాదమరి మండలం వాస్తవ్యులు,అలాగే

1,00,000 రూపాయలు, దాత శివ శంకరి , సంగారెడ్డి తెలంగాణ వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, తదితరులు ఉన్నారు.

# భాగ్యమ్మ భౌతికకాయానికి నివాళ్ళు అర్పించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్



ఐరాల , ఆగస్టు 23 స్వర్ణ సాగరం

ఐరాల,పూతలపట్టు మండలం, తిమ్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు, తిమ్మరెడ్డిపల్లె గ్రామ కమిటీ అధ్యక్షులు ఆర్.రాజేంద్ర నాయుడు తల్లి గారైన రాశినేని భాగ్యమ్మ మృతిదేహానికి పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ నివాళ్ళు అర్పించారు. శనివారం రాజేంద్ర నాయుడు నివాసానికి చేరుకున్న పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ భాగ్యమ్మ మృతిదేహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించిన అనంతరం రాజేంద్ర నాయుడును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, మాజీ మండల అధ్యక్షులు చంద్రమౌళి మరియు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గణనాధుని సేవలో ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వై. లక్ష్మణరావు



కాణిపాకం, ఆగస్టు 23 స్వర్ణ సాగరం

గణనాధుని సేవలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వై లక్ష్మణరావు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు , స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక , సూపర్డెంట్ వాసు, సీ.ఐ శ్రీధర్ నాయుడు, ఎస్సై నరసింహులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ట్రైన్ నుంచి అదుపుతప్పి వ్యక్తి కింద పడి మృతి



పూతలపట్టు స్వర్ణ సాగరం ఆగస్టు 23

పూతలపట్టు మండలం సమీపానగల బందార్లపల్లి సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం అయింది. స్థానికులు వివరాలు మేరకు ట్రైన్ నుంచి అదుపుతప్పి వ్యక్తి కింద పడి మృతి చెందినట్లు ఆనవాళ్ళు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దీనిపై పూతలపట్టు సీఐ కృష్ణమోహన్, రైల్వే పోలీసులకు జరిగిన సంఘటన తెలియజేశారు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే విచారిస్తున్నట్లు తెలిపారు.

# స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

స్వర్ణ సాగరం కె వి బి పురం:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్,మరియు మంత్రి వర్యులు , నారా లోకేష్ ఆదేశాలతోతిరుపతి పట్టణ కమీషనర్ మౌర్య అధ్వర్యం లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీని , తుడా చేర్మెన్ డాలర్ దివాకర్ రెడ్డీ ,పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్,డా.పూరిమిట్ల.కుమారీ కూటమి ఉమ్మడి చిత్తూరు మరియు తిరుపతి జిల్లా అధ్యక్షుడు డా హరి ప్రసాద్ కూటమి నాయకులు మరియు శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమము సురక్షితమైన ఆరోగ్యకరమైన రుతుపవనాల కోసం ఆరు సుత్రాలుపాటించమని చెప్పడం జరిగింది. 1.పరిశుభ్రత చేతులు కడుక్కోవడం పద్ధతులను ప్రోత్సహించడం. 2.పరిశుభ్రత లేని నివారణ వ్యాధులపై అవగాహన కల్పించడం.

3.పరిశుభ్రతలో సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం. 4.పబ్లిక్ టాయిలెట్లలో పరిశుభ్రతను కాపాడుకోండి5 మరియు వ్యాధి వ్యాప్తిని నివారించడం.

6.సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణకు భరోసా.

ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గం యస్సి సెల్ అధ్యక్షుడు సాదు, కేవిబీపురం మండల అధ్యక్షులు వి థామస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.




# రైతులకు జీలగలు-నవధాన్యాల పంపిణీ

స్వర్ణ సాగరం -తొట్టంబేడు,

రైతుల సంక్షేమమే టిడిపి ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నామని టిడిపి సీనియర్ నాయకుడు గాలి మురళి నాయుడు అన్నారు.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు తొట్టంబేడు మండలం ఇలగనూరు పంచాయతీ సచివాలయంలో రైతులకు 50% సబ్సిడీతో జీలగలు, నవధాన్యాలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గాలి మురళి నాయుడు మాట్లాడుతూ : -"ఇది రైతుల ప్రభుత్వం. రైతు సౌకర్యాల కోసం దివంగత నేత, మాజీ మంత్రి గోపాలకృష్ణారెడ్డి హయాంలోనే ఎన్నో మైలురాళ్లు నెలకొన్నాయి. వరి కోత మిషన్లు, రైతు రథాలు, టార్ బాలిన్ పట్టలు, నాగేళ్లు, స్ప్రేయర్లు, అనేక పనిముట్లు అప్పట్లో సబ్సిడీతో తొట్టంబేడు మండలంలోని రైతులకు అందించారు. ఆ ఘనత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ది అని పేర్కొన్నారు.

ఇక ఆయన తనయుడు, ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి రైతుల పక్షాన ఎల్లప్పుడూ నిలుస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తొట్టంబేడు మండలానికి 9 డ్రోన్లు కేటాయించిన ఘనత ఆయనకే దక్కిందని, వ్యవసాయ అధికారులు కూడా ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటున్నారని గాలి మురళి నాయుడు అన్నారు.అలాగే రైతులకు అవసరమైన ఎరువుల సమస్యపై కూడా స్పందించారు. "ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఈ సమస్యను ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం" అని హామీ ఇచ్చారు.మరియు మిల్లర్లకు లెవీ ఇవ్వకపోవడం వల్ల రైతులు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. "త్వరలోనే లెవీ పర్మిషన్ ఇచ్చిన పంటలు వేస్తే రైతులకు మంచి ధర లభిస్తుంది. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం" అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇలగనూరు మాజీ సర్పంచ్ మధు నాయుడు, వ్యవసాయ సహాయక అధికారులు పవన్, వినయ్ తుల్లా, అలాగే రైతులు నాగూరు, కుమారస్వామి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## జీవిత ఖైదీ శ్రీకాంత్ కి ఫెరోల్‌కు ఎమ్మెల్యేలు, మంత్రి మద్దతు దుర్మార్గమైన ప్రక్రియ

### వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి



పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 23.

జీవిత ఖైది శ్రీకాంత్ కు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు ఫెరోల్ కు రెకమెండ్ చేస్తూ ఎమ్మెల్యేల లెటర్ ఇవ్వడం దుర్మార్గమైన ప్రక్రియ అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, శ్రీధర్ రెడ్డిలు జీవిత ఖైదీ శ్రీకాంత్ కు ఫెర్రోల్ కోసం ఎమెమ్మెల్యేలు లెటర్ ఇవ్వడం, ఆ లేఖలపై హెూం మంత్రి వంగలపూడి అనిత సం తకం చేయడం ఘోరమైన చర్య అంటూ తీవ్రంగా విమర్శించారు. ప్రజా ప్రతి నిధులు పంపిన ఫెరోల్ లెటర్ ను గత నెల 16న జైలు శాఖ ఉన్నతాధికారులు తిరస్కరించినప్పటికీ పట్టు వదలకుండా జీవిత ఖైదీకి వంద రోజులు ఫెరోల్ ఇప్పించడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. జీవిత ఖైదీకి ఫెరోల్ ఇప్పించడం వెనుక దాగి ఉన్న రహస్యాన్ని రాష్ట్ర ప్రజలందరికీ చెప్పాల్సిన బాధ్యత హెూం మంత్రి అనితకి ఉందన్నారు. అంతేకాకుండా జీవిత ఖైదీని ఫెరోల్ పై విడుదల చేయించిన విషయంపై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై హెూం మం త్రి అనుచరులు దాడులకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. జీవిత ఖైదీని ఫెరోల్ పై విడుదల చేయించడం వెనుక ఎమ్మెల్యేలు, మంత్రి ఏ స్థాయిలో ముడు పులు అందుకున్నారో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిగ్గు తేల్చాలని పేర్కొన్నారు. తక్షణమే ఎమ్మెల్యేలపై వేటు వేసి హెూం మంత్రి పదవికి రాజీనామా చేయించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బంగారుపాలెం సిఐ కత్తి శ్రీనివాసులు ను సన్మానించిన ఉపసర్పంచ్ కామరాజు

బంగారుపాల్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 23



బంగారుపాలెం అర్బన్ పోలీస్ స్టేషను నందు విధులు నిర్వహిస్తూ ఆగస్టు 15న ఉత్తమ సేవా పథకం అందుకున్నందుకు బంగారుపాళ్యం అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులను బంగారుపాల్యం మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బంగారుపాలెం మండల వైఎస్సాఆర్ పార్టీ ఉపాధ్యక్షులు కామరాజు, మాజీ బంగారుపాళ్యం సర్పంచ్ ఎం బి కృష్ణ మూర్తి లు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు

## వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

### తోటపల్లి గూడూరు ఎస్సై వీరేంద్రబాబు

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం ఆగస్టు 23



వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకొని సుఖ సంతోషాలతో ఉండాలని తోటపల్లి గూడు ఎస్సై వీరేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు వినాయక మండపాల నిర్వహకులు గణేష్ యాప్ లో నమోదు చేసుకొని పోలీస్ శాఖకు సహకరించాలన్నారు లౌడ్ స్పీకర్లు డిజేలు పెట్టి వృద్ధులకు వ్యాధిగ్రస్తులకు ఇబ్బంది పెట్టరాదని హెచ్చరించారు. విద్యుత్ వాడే విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు .నిమజ్జన సమయంలో కోడూరు కాటేపల్లి సముద్ర తీరాల వద్ద ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.



స్వర్ణ సాగరం-ఏర్పేడు ఆగస్టు 23

మన్నసముద్రం గ్రామంలో నందు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా చేయడం జరిగింది పెద్ద ఎత్తున మహిళలు గ్రామస్తులు పాల్గొని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టిడిపి ఇన్చార్జి చెరుకునూరు సదా శంకర్ నాయుడు టిడిపి నాయకులు తాళ్లపాక సుధాకర్ రెడ్డి పంచాయతీ సెక్రటరీ అధికారులు మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామస్తులు చేత ప్రతిజ్ఞ చేయించారు.

# శ్రీకాళహస్తిలో వినాయక విగ్రహాల పంపిణీ

స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి,

శ్రీకాళహస్తి పట్టణంలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా శ్రీ వినాయక చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశేష ఏర్పాట్లు జరుగుతున్నాయి.ట్రస్ట్ అధినేత, మాజీ టూరిజం డైరెక్టర్ తిరిమెళ్ళ సురేంద్ర కుమార్ రెడ్డి శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ:-"ఈనెల 25వ తేదీ సోమవారం నుంచి మా ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని వినాయక విగ్రహాలను ఉచితంగా వినాయక చవితి కమిటీ భక్తులకు అందజేస్తాం. ప్రతి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని మరింత విస్తరించాం" అని చెప్పారు.గత 29 సంవత్సరాలుగా నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని ఆయన గుర్తు చేశారు. "వినాయక చవితి అనేది కేవలం పండుగ మాత్రమే కాదు%ొ% సమాజంలో ఐక్యత, సదభిప్రాయాలు పెంపొందించే ఆధ్యాత్మిక శక్తి. అందుకే ప్రతి సంవత్సరం విగ్రహాలను అందించడం ద్వారా భక్తుల సేవ చేస్తున్నాం" అని సురేంద్ర రెడ్డి వివరించారు.




అలాగే ఆయన మాట్లాడుతూ %-% "పత్రిక విలేకరులు, కమిటీ సభ్యులు, భక్తులు తప్పనిసరిగా హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి. పర్యావరణానికి హాని కలగకుండా సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలనే పంపిణీ చేస్తున్నాం" అని ప్రత్యేకంగా పేర్కొన్నారు.భక్తులు సాంప్రదాయ పద్ధతిలో పండుగను జరుపుకోవాలని, వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఇంటిలో ఆనందం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సమావేశంలో గోపి, తిరుమల తిరుపతి ప్రచార రథం సభ్యుడు రాజ్ కుమార్, అవధూత మాసపత్రిక ఎడిటర్ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# "వడ్ల దళారి పెట్టిన అక్రమ కేసులు తొలగించాలి "

## పోలీస్ స్టేషన్ వద్ద మీడియా సమావేశంలో

## బావురుమన్న తోటపల్లి గూడూరు గమళ్ళపాలెం రైతులు

తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 23

తోటపల్లి గూడూరు గమల్లపాలెం రైతులు తమను మోసం చేసినదళారి వ్యాపారి దండు వెంకటేశ్వర్లు వారి తండ్రి ని ప్రశ్నించినందులకు తమపై తిరిగి అక్రమ కేసులు బనాయించడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ దళారిరైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి రూ కోటి 70 లక్షలు పైకం ఇవ్వకుండా ఎగ్గొట్టినట్లు వారు పేర్కొన్నారు.స్థానికుల మధ్యస్థంతో పైకం ఇస్తానని ఒప్పుకున్న దళారి తిరిగి తమపైనే అక్రమ కేసులు పెట్టారని పేర్కొన్నారు.ఈ విషయం పోలీసుల దృష్టికి తెచ్చినట్లు వారు పేర్కొన్నారు తమకు న్యాయం కలుగజేసి అక్రమ కేసులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మన్యం కేశవులు కావలి సురేష్ కుమారిశ్రీనివాసులు మన్నెం




రాజయ్య మన్నెం జనార్ధన ఏపూరు రామయ్య ఆవుల రమ- ణయ్య తదితరులున్నారు

# పరిశుభ్ర పంచాయతీగా సాయి నగర్



## - సాయి నగర్ లో స్వచ్స్ ఆంధ్ర - స్వచ్ఛ దివస్

## - సర్పంచ్ డి.వి రమణ

స్వర్ణసాగరం-తిరుపతి రూరల్:-

తిరుపతి తిరుపతి రూరల్ మండలం సాయి నగర్ గ్రామపంచాయతీలో సాయి నగర్ సర్పంచ్ డి.వి రమణ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ దివాస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో మరియు విద్యార్థిని విద్యార్థుల ఉపయోగించే మరుగుదొడ్లలో బ్లీచింగ్ చల్లి శుభ్రపరిచారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.సందర్భంగా డి.వి రమణ మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి వర్యులు నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డిప్యూటీ సీఎం పంచాయతీరాజ్ వర్యులు శాఖ మంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్,చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని పిలుపుమేరకు స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.అభివృద్ధి పరిశుభ్ర పంచాయితీగా సాయి నగర్ గ్రామపంచాయతీ నీ తీర్చిదిద్దుతామని తెలిపారు, జిల్లా స్థాయిలో మన గ్రామపంచాయతీ పరిశుభ్ర పంచాయతీగా గతంలోనే అవార్డు దక్కించుకున్నదని రాబోయే రోజులలో రాష్ట్రస్థాయిలోనే గాక దేశస్థాయిలో కూడా పరిశుభ్రతలో ప్రథమ పంచాయతీగా స్థానం దక్కే విధంగా అందరం కలిసి స్థానిక ఎమ్మెల్యే గారు మరియు అధికారులతో కలిసి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం డ్వాక్రా భవనంలో జరుగుచున్న డ్వాక్రా సంఘాల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.షూరిటీలు లేకుండానే బ్యాంకులు రుణాలు ఇచ్చేది ఒక డ్వాక్రా సంఘాలకు మాత్రమే అన్నారు, 10,000 రుణంతో ప్రారంభమైన ద్వాకా సంఘాలు ఈ రోజున 30 లక్షల వరకు రుణాలు పొంది మహిళలు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని కొనియాడారు రాబోయే రోజుల్లో ఒక్కొక్క సంఘానికి కోటి రూపాయలు రుణాలు పొందే విధంగా అందరూ కలసి చేయాలని పిలుపునిచ్చారు.సాయి నగర్ గ్రామపంచాయతీ లోని నివాసితులకు అందరికీ ఇంటింటి ఎతేత సేకరణ గురించి వస్తున్న ఐవి వస్తున్న ఐ వి ఆర్ ఎస్ కాల్స్ కి స్పందించవలసిందిగా తెలిపారు. అధికారులు కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, పంచాయతీ సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, డ్వాక్రా మహిళలు, వెలుగు అధికారులు, ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నై బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తూ బిర్జి పైనుండి మైనర్ బాలుడు పడి మృతి చెందిన కేసు విచారణ






బంగారుపాలెం.స్వర్ణ సాగరం.ఆగస్టు 23

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాల్యం మండల పరిధిలోని చెన్నై బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తూ బిర్జి పైనుండి క్రింద పడి మైనర్ బాలుడు మృతి చెందిన కేసులో బంగారుపాళ్యం అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులు చిత్తూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆనందబాబు కు పిర్యాదు చేయగా శనివారం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆనంద్ బాబు వారి సిబ్బంది బంగారుపాళ్యం సీఐ కత్తి శ్రీనివాసులు,ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో మైనర్ బాలుడు మృతి చెందిన నేర స్థలాన్ని పరిశీలించి స్టేట్ మెంటు రికార్డు చేయడం జరిగిందని తదుపరి చర్యలు తీసుకునేందుకు లేబర్ ఆఫీసర్ రిపోర్ట్ వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు

# అప్పులు కట్టలేక వ్యక్తి మృతి



స్వర్ణసాగరం తవణంపల్లి ఆగస్టు-23

చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని అరగొండ గ్రామంలో అప్పులు కట్టలేక వ్యక్తి మృతి. తవణంపల్లె ఎస్సై చిరంజీవి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి తవణంపల్లి మండలం, అరగొండ పంచాయితీ అరగొండ గ్రామానికి చెందిన డి సుధీర్ కుమార్: 31 సంవత్సరం తిరుపతిలో డ్రైవింగ్ పనిచేసుకొంటూ, తన భార్య, పిల్లలతో అక్కడే ఉంటున్నారు. తిరుపతిలో ఎక్కువ అప్పులు చేసి. ఆ అప్పులు కట్టలేక ఇప్పటికి సుమారు మూడు నెలల క్రితం. డి సుధీర్ కుమార్ తన కుటుంబము తో కలసి అరగొండకి వచ్చి ఇక్కడే ఉంటున్నారు. ఇక్కడికి వచ్చినప్పటి నుండి ఏమి పనిచేయకుండా ఖాళీగానే ఉంటున్నాడు. ఈ విషయముగా డి సుధీర్ కుమార్ అతని భార్య ఇరువురూ గొడవపడి సుదీర్ కుమార్ అప్పులు ఎక్కువ చేసి వాటిని కట్టలేక, జీవనోపాది లేక జీవితము మీద విరక్తి చెంది, చనిపోవాలనే ఉద్దేశముతో తనంతట తానె పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు, ఈ విషయముగా డి సుధీర్ కుమార్ వాళ్ళ అమ్మ డి కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తవణంపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడమైనది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉన్నది.

# టేకుమంద గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించిన సీఐ కత్తి శ్రీనివాసులు



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 23

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండల పరిధిలోని టేకుమంద గ్రామంలో వినాయక చవితి పండుగ,గణేష్ నిమజ్జనం సమీపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లా పోలీసు శాఖ అప్రమత్తమై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు సీఐ కత్తి శ్రీనివాసులు శనివారం బంగారుపాళ్యం మండలంలోని టేకుమంద గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సిబ్బందితో కలిసి గ్రామంలోని అనుమానాస్పద ప్రదేశాలు,సమస్యాత్మక ప్రాంతాలను తనిఖీ చేశారు.గ్రామంలో గుర్తింపు పొందిన ట్రబుల్ మేకర్స్,రౌడీ షీటర్లు పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అలాగే ఇళ్లలో,అంగుళ్లలో వీధులలో తనిఖీలు నిర్వహించారు.అనంతరం గ్రామసభ నిర్వహించిన సీఐ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను శాంతియుతంగా భక్తి పూర్వకంగా పండగను జరుపుకోవాలని ఎలాంటి తగరాలు లేకండ అందరు సహకరించాలన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని గ్రామస్థులు కూడా అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా ఏదైనా సంఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తీసుకున్న ఈ చర్యలతో స్థానికులు, గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే పండుగ రోజుల్లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని పోలీసులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ బాబు, వెంకటేష్, రైటర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# విశ్రాంత ఉపాధ్యాయుడు చీమల బత్తయ్య మృతి



స్వర్ణ సాగరం-ఏర్పేడు ఆగస్టు 23

మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు చీమల బత్తయ్య శనివారం నాడు మృతి చెందారు .కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం నాడు మృతి చెందారు. ఈ సందర్భంగా పలువురుఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు ,సన్నిహితులు బంధువులు, ప్రముఖులు బత్తయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాళహస్తిలోని ఆయన స్వగృహం వద్ద పలువురు సంతాపం తెలిపారు.

# "నిర్మించుకున్న ఇంటిని కాపాడాలంటూ దళిత కుటుంబీకులు విజ్ఞప్తి "



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 23

మండలంలోని తోటపల్లి పంచాయతీ డక్టిలివారి పాలెం గ్రామస్తులు దళిత కుటుంబానికి చెందినమీదూరు శీనయ్యకుటుంబీకులు శనివారం పాత్రికేయ సమావేశంలో తన బాధను వెళ్ళబుచ్చారుతాను ఎంతో కష్టపడి వ్యయ ప్రయాసలతోనిర్మించుకున్న ఇంటిని గ్రామకంఠం ప్రభుత్వ భూమి అంటూ పంచాయతీ కార్యదర్శి తొలగించాలంటూ నోటీసు జారీ చేశారని తెలిపారు.ఇంటిని తొలగిస్తామని చెబుతున్నారని ఈ విషయంలో తనకు స్థానిక గ్రామస్తులు అధికారులు ప్రజా ప్రతినిధులు మానవతా ధోరణిలో ఆలోచించి తన ఇంటిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు

# వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశం



బంగారుపాళ్యం.స్వర్ణసాగరం.ఆగస్టు 24

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలోని ప్రజలు రాబోవు వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా ఎటువంటి గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సిఐ కత్తి శ్రీనివాసులు తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు,ఏ ఎస్సై మల్లప్ప,హెడ్ కానిస్టేబుల్ బాబు,కిరణ్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అక్షరాంధ్రపై వాలంటీర్లకు శిక్షణ



తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం ఆగస్టు 23

తోటపల్లి గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అక్షరాంధ్ర పై వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అక్షరాస్యత పెంపొందించాలన్న ఆలోచనతో మండలంలో 1800 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు సంబంధిత అధికారి పేర్కొన్నారు వీరిలో 1500 మందిని వెలుగు ఏపిఎం ఎనర్జీఎస్ ఏపీవో ద్వారా వాలంటీర్లను గుర్తించి వారికి శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు ఈ ప్రక్రియ బుధవారం నాటికి పూర్తవుతుందని తెలిపారు 2026 నాటికి వీరికి పూర్తి అక్షర జ్ఞానం కలిగించే విధంగా బోధన కొనసాగుతుందని తెలిపారు. శిక్షణా మండల పరిషత్ అధికారులతో పాటు ఎన్ ఆర్ జి ఎస్ అధికారులు పాల్గొన్నారు

# స్వచ్ఛ పాఠశాలే ధ్యేయం



స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ

పాఠశాల పరిశుభ్రతలో భాగంగా శనివారం మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఎకో క్లబ్ సమన్వయకర్త లక్ష్మయ్య ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పచ్చని కానుగ చెట్లు నాటారు.స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పాఠశాల పరిసరాలు పరిశుభ్రతతో పాటు పచ్చదనం పెంపు కోసం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, దాసు, జగన్నాధం, మాధవీలత, సుజన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఏలూరు పార్లమెంట్ కమిటీ సమావేశం హాజరు కానున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్



ఏలూరు, స్వర్ణ సాగరం

పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టిన టీడీపీ పార్లమెంటు కమిటీలను ఏర్పాటు చేసే నిమిత్తం ప్రతిపాదనలను స్వీకరించేందుకు నియోజకవర్గాల వారిగా త్రిసభ్య కమిటీల నియామకం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం ఏలూరు పట్టణంలోని క్రాంతి కళ్యాణ మండపంలో జరిగే ఏలూరు పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొననున్నారు. పార్టీ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులుగా ఉన్న మంత్రి గొట్టిపాటి రవి, బుద్దా నాగ జగదీష్, ఎం.ఎస్. రాజు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఈ సమావేశంలో మంత్రి పార్థసారథి, ఏలూరు పార్లమెంటు పరిధిలోని టీడీపీ శాసన సభ్యులు, ఏలూరు జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఇతర ముఖ్యనేతలు పాల్గొంటారు. కమిటీల ఏర్పాటుపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ నాయకులతో చర్చించనున్నారు.

# రిజర్వేషన్ పైఅంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా

స్వర్ణసాగరం బుచ్చినాయుడు కండ్రిగ.

సామాజిక న్యాయం సాధనలో రిజర్వేషన్లు కీలకమని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ చెరిపేయరాదని స్పష్టం చేస్తూ సూళ్లూరుపేటలో శనివారం మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించిబజారు వీధులలో ర్యాలీధర్నా నిర్వహించడంజరిగింది. హోలీ క్రాస్ వద్ద ప్రారంభమైన ఈ ధర్నా, ర్యాలీ ద్వారాఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగించి అనంతరం బస్టాండ్ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఆగి రాజ్యంగా నిర్మాత దళితులు ముద్దుబిడ్డ అయినా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగినది అనంతరం ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టు నెట్వర్క్తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షుడు వేణు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ధన శేఖర్, పాల్గొని మాలలను ఉద్దేశించి మాట్లాడారు.తిరుపతి జిల్లా ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ జిల్లా గౌరవలిఅధ్యక్షుడు– బుర్ర వేణుమాట్లాడుతూ :– “అంబేద్కర్ చూపిన మార్గమే సమాజాన్ని సమానత్వం వైపు నడిపించింది. ఆయన తత్వం వల్లే వెనుకబడిన వర్గాలకు అక్షరాస్యత, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశాలు లభించాయి. రిజర్వేషన్ హక్కులను రక్షించడం మనందరి బాధ్యత” అని పిలుపునిచ్చారు. అనంతరం తిరుపతి జిల్లా ఇంటర్నేషనల్



దళిత జర్నలిస్ట్ నెట్వర్క్ అధ్యక్షుడు కిరణ్ కుమార్లి మాట్లాడుతూ :%-% “ప్రతి యువకుడు అంబేద్కర్ ఆలోచనలను తమ జీవన విధానంలో ఆచరించాలి. డీఎస్సీ లో, గురుకుల పాఠశాలల్లో రిజర్వేషన్( మాల కులాన్ని) అమలు తప్పనిసరిగా కొనసాగాలి. రిజర్వేషన్ వ్యవస్థ కేవలం హక్కు మాత్రమే కాదు, అది వెనుకబడిన తరగతుల భవిష్యత్‌కు అస్త్రం” అని గుర్తుచేశారు. అనంతరం ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్వర్క్ జిల్లా ప్రధాన కార్యదర్

# “వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాల కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం”





కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 23

కనిగిరి పోలీస్ స్టేషన్ ఆవం-ణలో ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ ఏ.ఆర్. దామోదర్, ఐ.పి.యస్., గారి ఆదేశాల మే-రకు,కనిగిరి డిఎస్పి శ్రీ సాయి ఈశ్వర యశ్వంత్ కనిగిరి సీఐ షేక్ ఖాజావలి కనిగిరి ఎస్సైటీ శ్రీరామ్,కనిగిరి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ విగ్రహాల కమిటీ సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.వినాయక పండుగను శాంతియుతంగా, సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు.పోలీసులతో సహకరించి పండుగను సామరస్యపూర్వకంగా జరుపుకోవాలని కమిటీ సభ్యులను కోరారు.వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిపే సమయంలో ఎటువంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు తెలియజేయడమైనది.చిన్న విగ్రహం నుండి పెద్ద విగ్రహం వరకు ప్రతి ఒక్క విగ్రహానికి తప్పనిసరిగా పోలీసు వారి పరిమిషన్ తీసుకోవాలని ఆయన తెలియ జేయడమైనది.

# ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యపై డిఅర్సి సమావేశం లో ప్రస్తావించిన చిర్రి బాలరాజు



పోలవరం స్వర్ణ సాగరం

పోలవరం నియోజకవర్గానికి చెందిన ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న సత్య సాయి బాబా మంచినీటి పథకం లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు డిఆర్సి సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఉద్యోగులు అనేకకాలంగా వేతన సమస్యలు,సాంకేతిక సిబ్బంది కొరత,అవసరమైన వనరుల లభ్యతలో ఆలస్యం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యలు పరిష్కరించకపోతే పథకం సక్రమంగా కొనసాగడంలో ఆటంకాలు కలుగుతాయని మంత్రులు మరియు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అలాగే, ఈ పథకం ద్వారా వేలాది కుటుంబాలు స్వచ్ఛమైన తాగునీరు పొందుతున్నందున, ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు సిబ్బంది నియామకాలు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

డిఆర్సి మీటింగ్ లో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సహా ఉన్నతాధికారులు ఎమ్మెల్యే అభ్యర్థనను సానుకూలంగా స్వీకరించి, త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# దొరవారి సత్రం ఎస్సై అజయ్ కుమార్ ఉక్కుపాదం - పేకాట రాయుళ్లకు చెక్

**సురపు అగ్రహారం ఫారెస్ట్ ఏరియాలో డ్రోన్ సహాయంతో పేకాట స్థావరం గుర్తింపు**

**ఎస్సై అజయ్ కుమార్ మెరుపు దాడులు ఐదుగురు అదుపులో**

**రూ.4,130 నగదు స్వాధీనం డ్రోన్ కెమెరా సాయంతో ఆపరేషన్**

**జూదాలకు చెక్, మత్తు పదార్థాలకు అదుపులో ఎస్సై అజయ్ కుమార్ పనితీరు ప్రశంసనీయం**

స్వర్ణ సాగరం వార్తలు ,దొరవారిసత్రం మండలం...

మండలంలో పోలీసులు నేరగాళ్లకు చెక్ పెడుతున్నారు. ముఖ్యంగా మండల ఎస్సై అజయ్ కుమార్ దూకుడు, కఠిన వైఖరి నేరగాళ్లలో వణుకు పుట్టిస్తోంది. వరుస ఆపరేషన్లతో ఆయన పనితీరు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశమైంది.శనివారం సురపు అగ్రహారం గ్రామ ఫారెస్ట్ ఏరియాలో పేకాట స్థావరం ఉందన్న గుట్టు సమాచారం అందగానే అజయ్ కుమార్ తన బృందంతో మెరుపు దాడి చేశారు. డ్రోన్ కెమెరా సాయంతో పేకాట రాయుళ్ల కదలికలను గుర్తించి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,130 నగదు స్వాధీనం చేశారు. ఈ ఆపరేషన్ తిరుపతి జిల్లా ఎస్పీ, నాయుడుపేట డీఎస్పీ ఆదేశాల మేరకు, నాయుడుపేట రూరల్ సీఐ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తయింది. దాడుల తర్వాత ఎస్సై అజయ్ కుమార్ మాట్లాడుతూ దొరవారి సత్రం మండలంలో జూదాలు, పేకాటలు, మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని హెచ్చరించారు. ఇప్పటికే ఆయన వరుస ఆపరేషన్లతో పేకాట స్థావరాలు, జూదాలకు





చెక్ పెడుతుండగా, మత్తు పదార్థాల రవాణా అరికట్టడంలోనూ ముందంజలో ఉన్నారు. ఎస్సై అజయ్ కుమార్ కఠిన వైఖరి వల్ల మండలంలో శాంతి వాతావరణం నెలకొంటోంది. జిల్లా పోలీస్ విభాగంలోనూ ఆయన పనితీరు ప్రత్యేకంగా నిలుస్తోంది.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# రిజర్వేషన్ల పరిరక్షణకై సూళ్లూరుపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా

**స్వర్ణ సాగరం -శ్రీకాళహస్తి,**

సామాజిక న్యాయం సాధనలో రిజర్వేషన్లు కీలకమని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ చెరిపేయరాదని స్పష్టం చేస్తూ సూళ్లూరుపేటలో శనివారం ఘనంగా ధర్నా జరిగింది. హోలీ క్రాస్ వద్ద ప్రారంభమైన ఈ ధర్నా, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో ఐడిజెఎన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి ధన శేఖర్, గౌరవ అధ్యక్షుడు వేణు పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

అధ్యక్షుడు- లికిరణ్ మాట్లాడుతూ :- “అంబేద్కర్ చూపిన మార్గమే సమాజాన్ని సమానత్వం వైపు నడిపించింది. ఆయన తత్వం వల్లే వెనుకబడిన వర్గాలకు అక్షరాస్యత, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశాలు లభించాయి. రిజర్వేషన్ హక్కులను రక్షించడం మనందరి బాధ్యత” అని పిలుపునిచ్చారు.ప్రధాన కార్యదర్శి ధన శేఖర్ మాట్లాడుతూ :%-% “ప్రతి యువకుడు అంబేద్కర్ ఆలోచనలను తమ జీవన విధానంలో ఆచరించాలి. డీఎస్సీ లో, గురుకుల పాఠశాలల్లో రిజర్వేషన్ లలో అన్యాయం జరిగింది.



రిజర్వేషన్ లలో సవరణ జరగాలి రిజర్వేషన్ వ్యవస్థ కేవలం హక్కు మాత్రమే కాదు, అది వెనుకబడిన తరగతుల భవిష్యత్‌కు అస్త్రం” అని గుర్తుచేశారు.గౌరవ అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ:%-% “అంబేద్కర్ స్ఫూర్తి వల్లే ఈ దేశంలో సమాన హక్కులు కలిగాయి. ఆయన చూపిన మార్గం వల్లే దళితులు, వెనుకబడిన వర్గాలు విద్య, ఉద్యోగాలలో ముందడుగు వేస్తున్నారు. ఈ ప్రయాణం ఆగకూడదు. అందుకే మనందరం ఐక్యంగా రిజర్వేషన్ హక్కులను కాపాడుకోవాలి” అని పిలుపునిచ్చారు.

వక్తలు ముగ్గురూ ఏకకంఠంగా మాట్లాడుతూ %-% “అంబేద్కర్ కలల సమాజం అంటే ఎవరూ వెనుకబడని సమాజం. రిజర్వేషన్ వ్యవస్థను కాపాడితేనే ఆ కలలు సాకారం అవుతాయి” అని హామీ ఇచ్చారు.

ధర్నాలో పాల్గొన్న ప్రజలు నినాదాలు చేస్తూ “అంబేద్కర్ చూపిన దారినే మేము నడుస్తాం%ొ% రిజర్వేషన్ మా హక్కు %-% ఎవరూ కాజేయలేరు” అంటూ గళమెత్తారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా, మాల ప్రజల్లో చైతన్యం నింపేలా సాగింది.

# అంగన్వాడి కేంద్రాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

## సిడిపిఓ ఆషా బేగం

**కనిగిరి నియోజకవర్గం వెలిగండ్ల ఆగస్టు 23**

వెలిగండ్ల అంగన్వాడి కేంద్రాల పట్ల కార్యకర్తలు నిర్లక్ష్యం ఇస్తే తగిన చర్యలు తప్పవని వెలిగండ్ల సిడిపిఓ షేక్ ఆషా బేగం తెలిపారు. శనివారం మం డలంలోని ప్రాజెక్టు పరిధి లోని పలు అంగన్వాడి కేంద్రం లను సిడిపిఓ సందర్శించడం జరిగినది. అంగన్వాడి కేంద్రంలోని స్టాకును రికార్డులను పరిశీలించడం జరిగినది కేంద్రమును సమయపా లన పాటించాలని లబ్ధిదా రుల సమాచారమ-ును రిజిస్టర్లో నమోదు చేయాలని ప్రతిరోజు కేంద్ర సమాచారమును ఆన్లైన్లో మొబైల్ అప్లికేషన్లో నమోదు చేయవలెనని సూచిం చారు మరి ముఖ్యంగా పిల్లల యొక్క పెరుగుదల పర్యవేక్షణ పై దృష్టి సారించాలని వారి పోషణ ఆరోగ్యము ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ పై టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు ప్రాజెక్టులోని అన్ని కేంద్రాలలో బాలల యొక్క పెరుగుదల పర్యవేక్షణ పై నిత్యము శ్రద్ధ చూపు వల్లనని సిడిపిఓ ఆదేశించారు కేంద్రంలో అంగన్వాడి కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లయితే చర్యలు తప్పు అని హెచ్చరించారు. అంగన్వాడి కేంద్రములు వాటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచవలనని సూచించారు మనబడి కేంద్రము సంబంధించి అనేకమైన దిశ నిర్దేశాలు చేసి ఉన్నారు.





# అపస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాల

## అపస్మా నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల అవగాహన సమావేశం

**నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 23**

ఉపాధ్యాయుల స్టేట్ ఇన్సూరెన్స్ పై అవగాహన సదస్సును నెల్లూరు ఏసీ నగర్ లోని శ్రీ వివేకానంద స్కూల్లో అపస్మా జిల్లా అధ్యక్షుడు నేల నూతన శ్రీధర్ . అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్




నేతాజీ సుబ్బారెడ్డి ఈఎస్ఐ జాయింట్ రీజనల్ డైరెక్టర్ కె రాము,. నెల్లూరు ఈఎస్ఐ మేనేజర్ శివాజీ అపస్మా జిల్లా కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి జిల్లా ట్రెజరర్ కృష్ణారావు స్టేట్ జాయింట్ సెక్రెటరీ ప్రభాకర్ స్టేట్ అడ్వైజర్ వెంకట్రామయ్య . నెల్లూరు సిటీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్ రెడ్డి,జిల్లా మొత్తం నుండి 120 మంది కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# పరవళ్లు తొక్కుతున్న కైగల్ జలపాతం



**స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి ఆగస్టు 23:-**

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మండలం లోశుక్రవారం రాత్రి ఎగువన కురిసిన భారీ వర్షాలకు కైగల్ జలపాతం పొంగిపొర్లుతోంది. కొన్ని నెలలుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నా కైగల్ వాటర్ పాల్ కు మాత్రం నీరు చేరలేదు. ప్రకృతి మధ్యలో ఉన్న ఈ జలపాతం ఒకప్పుడు ప్రముఖ పర్యాటక ప్రాంతంగా ఉండేది. పోలీసుల ఆంక్షలు, కొన్ని ప్రమాదాల నేపథ్యంలో పర్యాటకుల రాక పూర్తిగా తగ్గిపోయింది. ఇక్కడికి కర్ణాటక తమిళనాడు నుంచి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు

# సోమవారం నాడు అందరికీ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..



**స్వర్ణసాగరం-ఏర్పేడు ,ఆగ స్టు 23:**

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను సోమవారం నుంచి(25/08/2025)న ఏర్పేడు మండలంలో పంపిణీ చేయనున్నారు. తహసీల్దారు ఎం.భార్గవి ఈ మేరకు వివరాలు వెల్లడించారు . ఇటీవల నూతనంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సైతం స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామాలలోని వారి ఇంటి వద్దనే పంపిణీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని తహసిల్దారు భార్గవి ఓ ప్రకటనలో తెలిపారు.

# బావిలో పడి వ్యక్తి మృతి



**స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి ఆగస్ట్ 23 :-**

చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లి పంచాయతీ వ్యవసాయ పొలం వద్ద కల బావిలో పడి పిచ్చిగుండ్లపల్లి కి చెందిన అశ్వత్ (40)అనే వ్యక్తి మృతి చెందడం జరిగినది. అశ్వత్ ఈ మధ్యకాలంలో కొద్దిగా మానసిక ఆందోళనకు గురి అయినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తున్నది. పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించనున్నట్లు పోలీసు వారు తెలియజేశారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో-వ్యక్తికి గాయాలు



**పెళ్ళకూరు స్వర్ణసాగరం ఆగస్టు 23**

నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో అక్కగారిపేట గ్రామం వద్ద సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న లారీని శనివారం రాత్రి నాయుడుపేట నుండి శ్రీకాళహస్తికి వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు ఢీకొనడం జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సాలపాక్షి అంకయ్య కు గాయాలైనాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలు. తొట్టంబేడు మండలం దొమ్మరపాలెం ప్రాంతానికి చెందిన అంకయ్య ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేట నుండి శ్రీకాళహస్తికి వెళుతూ మార్గం మధ్యలో అక్కగారి పేట గ్రామ సమీపంలో సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అంకయ్యకు తీవ్ర రక్త గాయాలైనాయి. 1033 అంబులెన్స్ వాహనం క్షతగాత్రుని చికిత్సలు మొత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

# కోలా ఆనంద్‌ను సత్కరించిన ప్రెస్ క్లబ్- అధ్యక్షులు కందుకూరి మురళి రాయల్



**రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 23**

భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కోలా ఆనంద్ ని రేణిగుంట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కందుకూరి మురళి రాయల్ శనివారం శ్రీకాళహస్తిలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు చిన్నరావు, ముని రామయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.




**గుడిపాల స్వర్ణ సాగరం ఆగస్టు 23**

అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ రా బాడిన సమాసచారం మేరకు ఈ రోజు తెల్లవారు జామున సుమారుగా 2గంటలకు మాకు రాబడిన సమాచారం మేరకు NR పేట లోని ఇసుక అక్రమరావన చేస్తున్నారాణానే సమాచారంతో నేను, నా సిబ్బంతితో కలసి %జవీ% కొత్త ఇండ్లు వద్ద దాడి చేయగా, ఒక్క టిపర్ ఇసుక లోడుతో పోనై వైపుగా పోతుండుగా డ్రైవర్ శరణని అరెస్ట్ చేయడమైనది. అంతే కాంకుండా చెప్పిన స్టేట్మెంట్ ప్రకారం టిపర్ ఓనర్ మరియు ఇసుక డంప్ చేసి అక్రమంగా టిపర్స్ కి చేస్తున్న నారాగల్లు కి చెందిన జనసేన మండల అధ్యచుడు రూప్ కుమార్ అను అతనిపై కూడా కేసు నమోదు చేసి ధ్యారాప్తు చేయడమైనది

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# కీళ్ల నొప్పులు వేధిస్తున్నాయా..?



వర్షాకాలం, చలి కాలంలో చాలామందిని వేధించే ప్రధాన సమస్య కీళ్ల నొప్పులు. వాతావరణంలో తేమ, ఉష్ణోగ్రత మార్పుల కారణంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. అయితే కొన్ని సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వ్యాయామం: తేలికపాటి వ్యాయామం, యోగా, స్ట్రెచింగ్ వంటివి కీళ్ల కదలికను మెరుగుపరుస్తాయి. రక్త ప్రసరణను పెంచుతాయి. అయితే వ్యాయామం చేసేటప్పుడు తేమతో కూడిన ప్రదేశాలకు దూరంగా ఉండటం మంచిది.కీళ్లను చలి నుంచి రక్షించడం చాలా ముఖ్యం. మోకాళ్లు, నడుము భాగాలను వెచ్చని దుస్తులతో కప్పి ఉంచండి. అలాగే, తడి బట్టలు, బూట్లు, చెప్పులు ఎక్కువసేపు ధరించకుండా ఉండండి. సరైన ఆహారం: మీ ఆహారంలో పసుపు, అల్లం, తాజా పండ్లు చేర్చుకోండి. ఇవి సహజసిద్ధంగా మంటను తగ్గిస్తాయి. అలాగే ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే అవిసె గింజలు, వాల్‌నట్‌లు, చేపలు తినడం వల్ల వాపు తగ్గుతుంది. ఉప్పు ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించడం కూడా చాలా ముఖ్యం. వర్షాకాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉండటం వల్ల శరీరంలో విటమిన్ డి స్థాయిలు తగ్గుతాయి. కాబట్టి, పాలు, పనీర్, ఆకుకూరలు వంటి విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవడం అవసరం. సరైన భంగిమ: ఒకే చోట ఎక్కువసేపు కూర్చోవడం కీళ్లపై ఒత్తిడిని పెంచుతుంది. ప్రతి 45 నిమిషాలకు లేచి కాసేపు అటూ ఇటూ తిరగండి. కూర్చున్నప్పుడు సరైన భంగిమలో కూర్చోవడం కూడా అవసరం. వర్షాకాలంలో తడి ప్రదేశాల్లో జారిపడి గాయాలయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి యాంటీ–స్లిప్ బూట్లు ధరించడం మరియు తడి నేలలపై జాగ్రత్తగా నడవడం చాలా ముఖ్యం. బరువు నియంత్రణ: అధిక బరువు కీళ్లపై ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది. కొద్దిగా బరువు తగ్గినా నొప్పి గణనీయంగా తగ్గుతుంది. తగినంత నీరు త్రాగడం వల్ల కీళ్లలోని ద్రవాలు గట్టిపడకుండా ఉంటాయి. ఇది కీళ్ల కదలికను సులభతరం చేస్తుంది. ఈ చిట్కాలను పాటించడం ద్వారా కీళ్ల నొప్పుల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# మునగ గింజల్లో దాగున్న ఆరోగ్య రహస్యాలు




మునగ ఆకులు వాటి లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. కానీ మునగకాయల్లోని చిన్న విత్తనాలు కూడా తక్కువేమీ కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఈ విత్తనాలు మునగ కాయల నుండి వస్తాయి. శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ఉపయోగించబడుతున్నాయి. ఈ విత్తనాలలో పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు, శక్తివంతమైన మొక్కల సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మునగ గింజలు ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్, విటమిన్ సి వంటి యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తాయి. మన శరీర కణాలను వృద్ధాప్యం, వ్యాధుల నుండి రక్షిస్తాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మంట తగ్గుతుంది. శరీర రోగనిరోధక శక్తి బలపడుతుంది. మునగ గింజలు శరీరంలో ఇన్సులిన్ లాగా పనిచేసే సమ్మేళనాలతో నిండి ఉన్నాయని, ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుందని అనేక అధ్యయనాలు చూపించాయి. ఇది ముఖ్యంగా మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మునగ గింజలు మెగ్నీషియం, జింక్, ఇనుము, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకలు, కండరాలు, నరాల పనితీరుకు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలకు చాలా ముఖ్యమైనవి. మునగ గింజలలో జింక్, విటమిన్ సి కనిపిస్తాయి. ఇవి మన రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. తరచుగా వచ్చే వ్యాధుల నుండి మనల్ని రక్షిస్తాయి. ఫైబర్ అధికంగా ఉండే మునగ గింజలు జీర్ణక్రియకు సహాయపడతాయి. మలబద్ధకాన్ని నివారిస్తాయి. మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. ఈ విత్తనాలు ఒమేగా–3, ఒమేగా–9 కొవ్వు ఆమ్లాలను అందిస్తాయి. ఇవి చర్మాన్ని తేమగా ఉంచుతాయి. ముడతలను తగ్గిస్తాయి. జుట్టును బలపరుస్తాయి. మునగ గింజల నూనెలో అద్భుతమైన మోనోశాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను ప్రోత్సహిస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ విత్తనాలు మెదడు ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను ఇనుము, జింక్‌ను అందిస్తాయి. దీంతోపాటుగా జ్ఞాపకశక్తి, నాడీ వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

# రోజుకో ఖర్జూరం పండు తింటే..



డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మంచివి. అందుకే వీటిని ఎక్కువగా ఆహారంలో భాగంగా తీసుకోవాలని వైద్యులు చెబుతుంటారు. ముఖ్యంగా ఖర్జూరాలు శరీరానికి చాలా మంచివి. ఖర్జూరాలు.. ప్రకృతి సహజంగా లభించే తీపి పదార్థం. అంతేకాదు, ఇది పోషక విలువలకు నిలయం కూడా. రోజూ ఓ ఖర్జూరం తినడం వల్ల శరీరంలో ఎన్నో సానుకూల మార్పులు వస్తాయని నిపుణులు అంటున్నారు. ఇది అనేక రకాల ఆరోగ్య సమస్యలకు దివ్యౌషధంగా కూడా పనిచేస్తుంది. ఖర్జూరంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది కడుపును శుభ్రపరచడానికి, మలబద్ధకం సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది. ఖర్జూరంలో కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అంతేకాకంఉడా ఆర్థరైటిస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఖర్జూరాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఖర్జూరంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ బి6, ఐరన్ శరీరాన్ని వివిధ వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఖర్జూరాలు శరీరంలో రక్త ఉత్పత్తిని మెరుగుపరుస్తాయి. అవి చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కూడా సహాయపడతాయి. అందువల్ల ప్రతిరోజూ ఓ ఖర్జూరం పండు తినడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు, శక్తి లభిస్తాయి. ఖర్జూరంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఖర్జూరంలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఈ మూలకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయి. వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీనపడతాయి. ఖర్జూరంలో లభించే కాల్షియం ఎముకలను బలపరుస్తుంది.

# గుమ్మడి ఆకులతో మస్త్ ఆరోగ్యం!



అన్ని రకాల పండ్లు, కూరగాయలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, మనం గుమ్మడికాయ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే..గుమ్మడి దాని గుణాల కారణంగా ఆరోగ్య నిధి అంటారు. ఇది మాత్రమే కాదు, ఆయుర్వేదంలో గుమ్మడికాయను మంచి ఔషధంగా కూడా వర్ణించారు. కానీ గుమ్మడికాయ, దాని గింజలతో పాటుగా దాని ఆకులు కూడా తింటారని, అవి రుచిలో, ఆరోగ్య పరంగా కూడా ప్రయోజనకరంగా ఉంటాయని మీకు తెలుసా. గుమ్మడికాయ ఆకులు ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. మీరు నిరంతరం మలబద్ధకంతో బాధపడుతుంటే గుమ్మడికాయ ఆకులు ఉపశమనం కలిగిస్తాయి. గుమ్మడికాయ ఆకులలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీరు దీన్ని ప్రతిరోజూ తీసుకుంటే మలబద్ధకం నుండి మీకు తక్షణ ఉపశమనం లభిస్తుంది. ఇది మాత్రమే కాదు ఇది కడుపుని క్లియర్ చేయడానికి కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గుమ్మడికాయ ఆకులు గుండె సమస్య గ్యాస్ట్రిక్ సమస్యను నివారిస్తుంది. గుమ్మడికాయ ఆకులలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇందులో భాస్వరం కూడా ఉంటుంది. ఇది మీ ఎముకలను బలపరుస్తుంది. దంతాల అభివృద్ధిలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మీరు దీన్ని ప్రతిరోజూ తీసుకుంటే, కీళ్ల నొప్పులు, అలసట నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

గుమ్మడికాయ ఆకులలో మంచి మొత్తంలో ఇనుము కూడా ఉంటుంది. ఇది రక్తహీనతను నయం చేస్తుంది. ఋతుస్రావ సమయంలో కడుపు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మీరు ఋతుస్రావ సమయంలో కూడా దీనిని తినవచ్చు. గుమ్మడికాయ ఆకులలో చిన్నగా కరిగే ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది మీ ప్రేగులలో ఆమ్లం ఏర్పడే ప్రక్రియను ఆపడానికి పనిచేస్తుంది. ఇది రక్త కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. దీనిలో ఉండే ఫైబర్ గుండె జబ్బులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

# నిమ్మకాయ ముక్కను ఫ్రిజ్‌లో పెడితే ఏమవుతుంది?

నిమ్మకాయంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందం నుంచి ఆరోగ్యం వరకు దీనిని వివిధ రూపాలలో ఉపయోగిస్తారు. నాన్ వెజ్ ఉందంటే నిమ్మకాయ ఉండాల్సిందే. నిమ్మకాయ కేవలం ఆహార పదార్థాలలో రుచిని పెంచడానికి మాత్రమే కాదు.. ఇతర ఉపయోగాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా నిమ్మకాయను కోసి ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల కొన్ని అద్భుతమైన ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనిలోని యాంటీ బాక్టీరియల్, సిట్రిక్ యాసిడ్ లక్షణాలు ఫ్రిజ్‌ను శుభ్రంగా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఫ్రిజ్‌ను ఎంత శుభ్రంగా ఉంచినా కొన్నిసార్లు అందులో దుర్వాసన రావడం సాధారణం. ఇలాంటి సందర్భాలలో ఒక నిమ్మకాయను రెండు ముక్కలుగా కట్ చేసి రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే ఆ దుర్వాసన తొలగిపోతుంది. నిమ్మకాయలోని సిట్రిక్ యాసిడ్ చెడు వాసనను పీల్చుకుని, ఫ్రిజ్‌లో తాజా సువాసన ఉండేలా చేస్తుంది. ఫ్రిజ్‌లో ఉంచిన కొన్ని ఆహార పదార్థాలు త్వరగా చెడిపోతుంటాయి. ఈ సమస్యను నివారించడానికి నిమ్మకాయ ముక్కలను ఉపయోగించవచ్చు. నిమ్మకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆహార పదార్థాలు త్వరగా చెడిపోకుండా కాపాడతాయి. అయితే ఈ ప్రయోజనం కోసం ఎప్పుడూ తాజా, శుభ్రమైన నిమ్మకాయ ముక్కలను మాత్రమే ఉపయోగించడం మంచిది. నిమ్మకాయ ముక్కలను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల కలిగే మరో ప్రయోజనం, ఇది ఫ్రిజ్‌లోని గాలిని సహజంగా శుద్ధి చేస్తుంది.



నిమ్మకాయలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సిట్రిక్ యాసిడ్ ఫ్రిజ్‌లోని గాలిని తాజాగా ఉంచుతాయి. దీనివల్ల ఫ్రిజ్‌లో ఉండే బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్ల ప్రమాదం కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది మన ఆరోగ్యాన్ని కాపాడడంలో కూడా సహాయపడుతుంది.